ప్రజాశక్తి
గురువారం 24 నవంబర్ 2022 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

తిరుగుముఖం

- వలస కూలీలను దెబ్బతీసిన తెల్లబంగారం
- పొరుగు రాష్ట్రాలకు పోయినా పనుల్లేవు
- గతంలో ఈ పరిస్థితి లేదంటున్న వలస కూలీలు
- పనుల్లేక తిరిగి గ్రామాలకు వెళుతున్న కూలీలు

జిల్లాల ఎల్లలు దాటి పొట్టకూటి కోసం వలస బాట పట్టిన కూలీలు పనుల్లేక తిరుగుముఖం పట్టారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వేలాదిగా పత్తి, మిర్చి తీతలకు వచ్చే వీరు అకాల వర్షాలకు పనుల్లేక, తెలంగాణా రాష్ట్రానికి కూడా వలసలు వెళ్లారు. అక్కడా పనుల్లేక అరకొర సంపాదన ఖర్చు అయిపోయి సొంత జిల్లాకు తిరుగు ముఖం పట్టారు. జనవరిలో వరి కోతలకన్నా పనులుంటే బ్రతుకుంటుందని తెలిపారు.



పనుల్లేక ప్రకాశం జిల్లాకు తిరిగి వెళ్లడానికి మాచర్ల లో బస్ కోసం వేచి ఉన్న వలస కూలీల కుటుంబాలు

ప్రజాశక్తి-మాచర్ల

అధిక వర్షాలు పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పత్తి పంటను బాగ దెబ్బతీశాయి. రైతులు గత మూడేళ్లుగా వర్షభావ పరిస్థితులు ఎదురవుతుండటంతో మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో ముందస్తు పత్తి పంటకు మొగ్గి మే నెలలోనే సాగు చేశారు. రెండు తీతల తరువాత అధిక వర్షాలతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. యదావిధిగా అదునులో పత్తి పంట వేసిన రైతులకు అధిక వర్షాలతో నష్టం జరిగింది. దీంతో కూలీలకు పనులు లేకుండా పోయాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా నుండి ప్రతి ఏటా వలస కూలీలు వందల సంఖ్యలో పత్తి, మిర్చి కోతల నిమిత్తం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అనేక గ్రామాలకు వలస వస్తుంటారు. ఈ ఏడాది పల్నాడు ప్రాంతంలో వలస కూలీల సంఖ్య చాల తక్కువగా కనిపించింది. ఇక్కడ వ్యవసాయ పనులు సరిగా లేకపోవటంతో ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలోని కోకోని గుంట తంగిరాల పల్లె గ్రామానికి చెందిన దళిత వలస కూలీలను తెలంగాణ ప్రాంతంలోని రైతులు పత్తి తీయడానికి పిలవగా గత నెలలో నల్గొండ జిల్లా మల్లేపల్లి సమీపంలోని ఓ గ్రామానికి వెళ్ళారు. వారు వెళ్లిన తరువాత కొద్ది రోజులు వర్షాలు పడటం, పత్తి పంట అనుకున్న స్థాయిలో లేకపోవటంతో నామమాత్రం కూలి దొరికిందన్నారు. అక్కడ కూడ పనులు లేక ప్రకాశం జిల్లా వలస కూలీలు ఇంటిబాట పట్టారు. మార్గ మధ్యలో ఆగిన వలస కూలీలను పల్నాడు జిల్లా విలేఖరులు పలకరించగా తమ ఆవేదన వ్యక్తం చేశారు.

మల్లేపల్లి సమీపంలోని ఒక గ్రామానికి వెళ్ళగా, అక్కడ కోన్ని రోజులు వర్షాలతో పనులు

6 లో



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా జెసి ఎ శ్యాం ప్రసాద్

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు
పల్నాడు జల్లా జెసి ఎ శ్యాం ప్రసాద్
క్వింటాల్ ఎ గ్రేడు ధర రూ.2060 - సాధారణ రకం రూ.2040

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రభుత్వ లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు సమర్ధవంతంగా చేపట్టాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ వ్యవసాయ సహాయకులకు సూచించారు. బుధవారం నరసరావుపేట భువన చంద్ర టౌన్ హాలులో 2022-23 ధాన్యం సేకరణపై గ్రామ వ్యవసాయ సహాయకులు, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బందికి, రైస్ మిల్లుల వద్ద నియమించిన అధికారులకు నిర్వహించిన శిక్షణా తరగతిలో జెసి మాట్లాడారు. క్వింటా ధాన్యానికి కనీస మద్దతు ధర ఎగ్రేడు రకానికి రూ.2060, సాధారణ రకానికి రూ.2040 చొప్పున కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపారు. ధాన్యం సేకరణకు కావలసిన గోనె సంచులు, హమాలీలు, రవాణా సౌకర్యం అన్ని కొనుగోలు కేంద్ర సిబ్బంది ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతు తన సొంత ఖర్చులతో గోనె సంచులు హమాలీలు రవాణా సౌకర్యము ఏర్పాటు చేసుకుంటే వాటికి సంబంధించిన చార్జీలు ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్దతు ధరతో పాటు రైతు ఖాతాకు జమ అవుతుందన్నారు. రైతులు తప్పనిసరిగా అధికారులు సూచించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండేలాగా చూడాలన్నారు. వచ్చే నెల 2వ వారం నుండి ధాన్యం కోతలు ప్రారంభమవుతాయని ఇప్పటినుంచే ఆర్‌బికెల ద్వారా రైతులకు ధాన్యం అమ్మకాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధర, ధాన్యం నాణ్యత ప్రమాణాలు, గోనె సంచులు, హమాలీలు, రవాణా సౌకర్యం, కొనుగోలు కేంద్రాల ద్వారా ఏర్పాటు వంటి విషయాల పైన విస్తత ప్రచారం చేసి అవగాహన కల్పించాలని ఆదేశించారు.

దళారులకు ధాన్యాన్ని విక్రయించకండి

ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, ధాన్యం కొనుగోళ్ల నిష్పక్షపాతంగా కొనుగోళ్లు జరుగుతాయని జెసి రైతులకు

6 లో

ప్రతి శనివారం హౌసింగ్ డే పాటించాలి

- గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యాదర్శి అజయ్ జైన్
- పొత్తూరు, ఏటుకూరు లేఆవుట్ పరిశీలన
- డిసెంబర్ 21కి ప్రతి మండలంలో ఒక లేఅవుట్‌లో

నూరుశాతం ఇళ్ల నిర్మాణం : జిల్లా కలెక్టర్



8లో

పొత్తూరు లేఅవుట్‌ను సందర్శించిన అజయ్‌జైన్, కలెక్టర్ తదితరులు





స్కూలు విద్యార్థులకు

కొరవడిన భద్రత

ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణం

పట్టించుకోని రవాణాశాఖ

6 లో

కౌలు రైతు చట్ట సవరణకు ఉద్యమం

- భూ యజమాని సంతకం నిబంధన తొలగించండి
- సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యాదర్శులు

వై రాధాకృష్ణ, ఎం హరిబాబు (వార్త మెయిన్‌లో)



గుంటూరులో మీడియాతో మాట్లాడుతున్న కౌలు రైతు రాష్ట్ర సంఘం నాయకులు

తిరుగుముఖం

(మొదటి పేజీ తరువాయి)

సాగలేదని, మిగిలిన కోద్ది రోజులు చేసిన పనికి వచ్చిన కూలి రాను, పోను ఖర్చులు తింటానికి సరిపడినట్లు తెలిపారు. తాము ఒట్టి చేతులతో ఇంటిబాట పట్టినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మేస్త్రి కోటపాటి వెంకటేశ్వర్లు, తలపాటి వెంకటమ్మ మాట్లాడుతూ మా గ్రామం నుండి పతి ఏటా పత్తి, మిర్చి కోతలకు వలస పోతుంటామని, ఎక్కువగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పల్నాడు ప్రాంతంలోనే పలు గ్రామాలలో తమకు పనులు దొరుకుతుంటాయన్నారు. గత ఏడాది, ఈ ఏడాది గడ్డు పరిస్థితులు ఎదురైనట్లు తెలిపారు. పత్తి ఇరుపులకు వచ్చామంటే నెల నుండి నెలా పది రోజులు పనులు చేసేవారమని, అన్ని ఖర్చులు పోను కుటుంబానికి రూ. 20వేలు మిగుల్చుకుని వెళ్ళేవారమని తెలిపారు. క్రిస్మస్ పండుగ ఖర్చులు వెళ్ళిపోయేవని అన్నారు. గత ఏడాది పనులు దొరకలేదు. ఈ ఏడాది తెలంగాణ నుండి కబురు వచ్చిందని సంతోషంతో పనులకు పోతే వచ్చిన డబ్బులు ఖర్చులకు సరిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాలం బాగుండి జనవరి తరువాత మిర్చి కోతలు అనుకూలంగా ఉంటే బ్రతుకు బండి నడుస్తుందని, లేదంటే అప్పులపాలు కావలసి వస్తుందని తెలిపారు. ఎప్పుడూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే పనులు దొరుకుతాయని, తెలంగాణ పోవాల్సిన అవసరం గతంలో రాలేదన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. బహిరంగ మార్కెట్లో దళారులు, మధ్యవర్తులు ప్రవేశించి కనీస మద్దతు ధర కన్నా తక్కువ ధరకు రైతుల నుండి కొనుగోలు చేసి ప్రభుత్వానికి అమ్మాలని చుస్తే సహించేది లేదని, కొనుగోలు కేంద్ర సిబ్బంది నిష్పక్షపాతంగా పని చేయాలని ఆదేశించారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను రైస్ మిల్లర్ల వద్ద నుండి సేకరించి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ చేసి రైతులకు అందుబాటులో ఉంచామని సి.ఎస్.డి.టి లకు సూచించారు. కస్టమ్ హైరింగ్ ట్రాక్టర్ లను ధాన్యం రవాణాకు ఉపయోగించాలని ఒకవేళ రైతులు ధాన్య సేకరణకు వాహనాలు సమకూర్చనిచో కొనుగోలు కేంద్రాల సిబ్బందిని రవాణా వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు.

మహిళ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-తెనాలి: రూరల్ గ్రామం అంగలకుదురులో మహిళ అనుమాస్పదంగా మృతి చెందింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంగలకుదురు రైల్వే గేటు సమీపంలో నివాసం ఉండే మల్లవరపు వైష్ణవి(23) బుధవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు తెనాలి జిల్లా ఆసుపత్రికి తరలించగా, ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతురాలికి రెండేళ్ళ క్రితం మల్లవరపు ప్యాట్రిక్‌తో వివాహైందని, వారికి ఏడాదిన్నర పాప ఉందన్నారు. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, మహిళ మృతిపై కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి పిర్యాదు లేదని, ప్రాథమిక సమాచారంతో విచారణ చేపట్టినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఇనిమెల్ల అభివృద్ధికి జీవీ చేసింది శూన్యం

ప్రజాశక్తి-ఈపూరు : సొంత గ్రామాన్ని అభివృద్ధి చేయని మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ,నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. మండలంలోని ఇనిమెల్లలో బుధ వారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ జీవీ ఆంజనేయులు పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఇనిమెల్లకు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను గ్రామస్తులకు అందజేశారు. సర్పంచ్ ఎం.మార్తమ్మ, వైసిపి మండల కన్వీనర్ కె.దేవరాజ్,ఎంపిడిఒ ఎ.ఉషా కిరణ్, తహశీల్దార్ సిహెచ్ విజయజ్యోతి కుమారి పాల్గొన్నారు.

స్కూలు విద్యార్థులకు కొరవడిన భద్రత

- ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణం
- పట్టించుకోని రవాణాశాఖ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల భద్రత గాలిలో దీపంలా మారింది. ఒకే ఆటోలో పరిమితికి మించి పిల్లలను ఎక్కించుకుని డ్రైవర్లు దూసుకుపోతున్నారు. కేవలం ఒకటో తరగతి నుంచి 10 వ తరగతి వరకు విద్యార్థులు ఆటోల్లో అసౌకర్యాల మధ్య పాఠశాలలకు వెళ్లి రావాల్సి వస్తుంది. గ్రామాల నుంచి పట్టణాలకు ఆర్‌టిసి బస్సులు అందుబాటులో లేకపోవడం వల్ల, పాఠశాలల బస్సులు కూడా రాని ప్రాంతాల్లో ఆటోల్లోనే ప్రయాణం చేయకతప్పడంలేదు. శివారు ప్రాంతాల నుంచి గుంటూరులోని వివిధ కార్పొరేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుంతా నిత్యం వచ్చి వెళ్తుంటారు. ఒక్కో ఆటోలో 12 నుంచి 15 మంది విద్యార్థులను ఎక్కిస్తున్నారు. రవాణాశాఖ అధికారుల కూడా ఈ ఆటోలపై కనీస తనిఖీలు లేవు. వీటిపై నియంత్రణ కొరవడటం వల్ల ఆటోలు ఇష్టారాజ్యంగా దూసుకుపోతున్నాయి. ఆటోల్లో ప్రయాణించే 9,10 తరగతుల బాలికలను సైతం కొన్ని సందర్భాలల్లో డ్రైవర్ పక్కన కూర్చొని ప్రయాణించక తప్పని పరిస్థితి నెలకొంది. దీంతో వీరు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వీరంతా పేద, మధ్య తరగతి విద్యార్థులు కావడం గమనార్హం. అలాగే జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే విద్యార్థులు కూడా ఎక్కువ మంది ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు. ప్రధానంగా చాలాగ్రామాలకు ఆర్‌టిసి బస్సులు లేవు. కొన్ని ప్రధాన మార్గాలో బస్సులు ఉన్నా ఉదయం, సాయంత్రం విపరీతమైన రద్దీతో వెళ్తుంటాయి. అయినా కొంత మంది విద్యార్థులు ఆర్‌టిసి బస్సులో స్టూడెంట్ పాస్ పై ప్రయాణిస్తున్నారు. బస్సులు లేని మార్గాల్లో మాత్రం ఆటోలపై ఆధారపడుతున్నారు. అంతేగాక రహదారుల సమస్యలతో ప్రైవేటు స్కూలు బస్సులు కూడా కొన్ని మార్గాల్లో రావడం లేదు. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో పరిసర గ్రామాల నుంచి బస్సులు ఉండటం లేదు. ఉన్నా ఉదయం ఒక సర్వీసు, సాయంత్రం ఒక సర్వీసు మాత్రమే వచ్చివెళ్తుంటాయి.

తుళ్లూరు మండలం పెదపరిమి-వడ్డమాను మార్గంలో రెండు గంటలకు ఒక బస్సు మాత్రమే వెళ్తుంది. తాడికొండ -కంతేరు-నిడమర్రు, నీరుకొండ, కురగల్లు మార్గంలో కూడా బస్సులు లేక ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు. చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాలకు బస్సులు లేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో ఆర్‌టిసి బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయాయి. ప్రధాన మార్గాల్లో అరగంటకు ఒక బస్సు, కుగ్రామాలకు వెళ్లే మార్గంలో రోజుకు రెండు మూడు సర్వీసులు మాత్రమే నడపటం వల్ల విద్యార్థులు ఆటోలపై ఆధారపడక తప్పడం లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. అమరావతి రావడానికి పరిసరగ్రామాలకు చెందిన విద్యార్థులు కూడా నానా తంటాలు పడుతున్నారు. జిల్లాలోని మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాలకు వెళ్లేందుకు పల్లెప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

ఎన్ఆర్ఐ భవనం పై నుండి పడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్


షేక్ షాదుల్లా(ఫైల్)

ఎన్ఆర్ భవనంపై నుండి ప్రమాదవశాత్తు పడి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని చిన్న కాకాని ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ఎన్ఆర్ఐ భవనం ఐదో అంతస్తు నుండి పడి భవన నిర్మాణ కార్మికుడు షేక్ షాదుల్లా (32) బుధవారం మృతి చెందారు. అతనికి భార్య , ఓ పాప, ఓ బాబు ఉన్నారు. తాడికొండకు చెందిన ఇతను తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పటిలాగే పనిచేసేందుకు ఎన్ఆర్ఐకి వచ్చిన ఆయన ఐదో అంతస్తు నుండి పని చేస్తూ ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ఈ ఘటనలో అతను అక్కడికి అక్కడే మృతి చెందాడు. ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలించిన భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు , సీఐటీయూ నేతలు మాట్లాడుతూ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణంగానే షాదుల్లా చనిపోయారని పేర్కొన్నారు. ఐదో అంతస్తులో పనిచేస్తున్నప్పటికీ ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదని సైడ్ వాల్స్ వద్ద నెట్ వలయం ఏర్పాటు చేయలేదని ఫలితంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుందని చెప్పారు. తరచూ ఇటువంటి సంఘటనలు ఎన్ ఆర్ఐ ఆస్పత్రిలో పరిపాటిగా మారాయిని అధికారులు నిద్రలేచి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని నాయకులు తిరువీధుల శ్రీనివాసరావు, జానీ భాష, వై కమలాకర్ రావులు డిమాండ్ చేశారు.

నియోజకవర్గం అభివృద్ధికి సమిష్టి కృషి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లేళ్ల అపిరెడ్డి

పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి కోరారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రగతిపై సమీక్షా సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మద్దాళి గిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు. ఆయా డివిజన్లలో జరుగుతున్న జరగాల్సిన పనులపై సమీక్షించారు.ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగరానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులుగా తామంతా ఒక్క తాటిపై నిలబడి గుంటూరు అభివృద్ధికి కట్టుబడతామని చెప్పారు. కార్పొరేటర్లు తమ వంతు సహకారం అందించాలని కోరారు. నగరంలో ప్రగతి పనులు వేగంగా జరుగుతున్నట్లు మేయర్ కావటి మనోహర్ నాయుడు వెల్లడించారు. ప్రస్తుతం రూ. 170 కోట్ల పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ, కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్లు పూర్తి సమన్వయంతో ప్రజోపయోగ పనులపై దృష్టి సారించాలని కోరారు. ప్రగతి పనుల విషయంలో పక్కాగా ప్రణాళికలు రూపొందించుకుని సమిష్టిగా ముందుకు సాగితేనే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. మిర్చియార్డు ఛైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, కార్పొరేటర్లు, కార్పొరేషన్ ఈఈ సుందరరామిరెడ్డి, డీఈ రఫీక్, ఏఈలు రాంబాబు, సునీల్, సురేంద్ర, నాగవేణి పాల్గొన్నారు.


ప్రతిభ కనబరిచిన వారిని సన్మానిస్తున్న ఈడి ఆదామ్ సాహెబ్

ఆర్‌టిసి ఉద్యోగులు ప్రయాణికులను గౌరవించాలి

ప్రజాశక్తి-మాచర్ల

ఆర్‌టిసి ఉద్యోగులు ప్రయాణికులను గౌరవించి వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సంస్థ ఈడి ఆదామ్ సాహెబ్ సూచించారు. ఆర్‌టిసి ఆధ్వర్యంలో ఈ నెల 21 నుండి 27 వరకు ప్రయాణికుల సంతోష వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈడి ఆదామ్‌సాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా మాచర్లకు విచ్చేసిన ఆయన బస్టాండ్, గ్యారేజిలను తనిఖీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆదాయ పరంగా మాచర్ల డిపోకు మంచి పేరు ఉందన్నారు. ఎలాంటి ఫిర్యాదు లేకుండా సిబ్బంది పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. ప్రయాణికుల సంతోష వారోత్సవాలలో భాగంగా ప్రయాణికులతో ముఖ్యంగా స్త్రీలు, విద్యార్థుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన పలువురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజరు ఆర్ పిచ్చయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్‌లో పడి ఉన్న ఖాళీ మందు సీసాలు

మందుబాబులకు అడ్డాగా అన్న క్యాంటీన్

ప్రజాశక్తి - తాడేపల్లి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం సమీపంలో గతంలో అన్న క్యాంటీన్‌గా అందరి ఆకలి తీర్చిన భవనం నేడు అసాంఘీక శక్తులకు అడ్డాగా మారింది. అమరావతి కరకట్ట సమీపంలో పొలాల మధ్యలో ఈ భవనం ఉండటంతో, సెక్యూరిటీ కూడా ఆ ప్రాంతంలో తగ్గించి వేయడంతో పగలు, రాత్రి తేడాలేకుండా మందుబాబులు మద్యం సేవిస్తూ వీరంగం వేస్తున్నారు. ఖాళీ సీసాలను అక్కడే పడేసి వెళ్ళడంతో పెద్దఎత్తున పేరుకుపోయి బార్‌ను తలపిస్తుంది. క్యాంటీన్‌లో ఉన్న విద్యుత్ లైట్లు, స్విచ్ బోర్డులు చోరీకి గురయ్యాయి. ఇప్పటికైనా మందబాబుల ఆగడాలను అరికట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.


మాట్లాడుతున్న కోవెలమూడి రవీంద్ర

ఓటర్లుగా చేరండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక 25వ డివిజన్‌లో ఓటర్ల నమోదు శిబిరాన్ని పశ్చిమ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర (నాని) బుధవారం పరిశీలించారు. అనంతరం శిబిరం వద్ద జరిగిన సమావేశంలో రవీంద్ర (నాని) మాట్లాడుతూ 18 ఏళ్ళ నిండిన ప్రతి యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటును నమోదు చేసుకోవాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకచారి, నగర అధ్యక్షులు దేగల ప్రభాకర్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు కసుకుర్తి హనుమంతరావు, ముత్తినేని రాజేష్, చింతకాయల రామారావు, మహిళ అధ్యక్షురాలు దాసరి జ్యోతి, డివిజన్ అధ్యక్షులు తెర్లగోర్ల అప్పారావు, దాసరి రమణ, 25వ డివిజన్ టిడిపి అధ్యక్షులు గాలం వెంకటేశ్వరావు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

170 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

నాగార్జున సాగర్‌లోని ఏపీ జెన్కో ఆధ్వర్యంలో భవ్యహెల్త్ సర్వీసెస్, మీనాక్షి కంటి ఆసుపత్రి వారు సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం స్థానిక జెన్కో క్వాటర్స్ వద్ద నిర్వహించారు.కంటి వైద్యులు ఉషా భవాని,వినయ్ ల ఆధ్వర్యంలో170 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.25 మందిని రిఫర్ చేశారు.ఈ సందర్భంగా జెన్కో ఈఈ వైఎస్‌అర్కే ప్రసాద్ మాట్లాడుతూ ఈ శిబిరంలో కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం శుభ పరిణామం అన్నారు. గిరిజన ప్రాంతాలకు చెందిన ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి వేలకు వేలు వెచ్చించి కంటి పరీక్షలు చేసుకోవడం కష్టమవుతుందని, దానిని దృష్టిలో పెట్టుకొని ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. జెన్కో డిఈ జి.రాజారెడ్డి మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అని మన పెద్దలు కంటి ప్రాముఖ్యతను చెప్పారని అటువంటి కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవలన్నారు. అనంతరం వైద్యులను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ఏఈ కె.రేవతి,భవ్య అడ్మినిస్ట్రేటర్ రామకృష్ణ,సిబ్బంది పాల్గొన్నారు

హక్కు పత్రాలుంటే వాహనాలు తీసుకెళ్లొచ్చు

ప్రజాశక్తి-యడ్లపాడు

మండల పరిధిలో పలు చోట్ల పోలీస్ శాఖ స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించిన యజమానులు స్టేషన్ పరిధిలో సంప్రదించి హక్కుపత్రాలను అందజేస్తే వారికి అప్పగిస్తామని యడ్లపాడు ఎస్సై పి.రాంబాబు తెలిపారు. దాదాపు12 గుర్తుతెలియని వాహనాలు పోలీస్ స్టేష న్‌లో గత కొంతకాలంగా భద్రపరిచినట్లు చెప్పారు. ఈ అవ కాశాన్ని వాహనాల యజమానులు సద్వినియోగం చేసు కోవాలని సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

నగరంపాలెం అవుట్ పోస్ట్ పనితీరు పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక చుట్టుగుంట సెంటర్ వద్ద నగరం పాలెం అవుట్ పోస్ట్ పనితీరును జిల్లా ఎస్పి ఆరీఫ్ హఫీజ్ పరిశీలించారు. పోలీస్ ఔట్ పోస్టులో పనిచేస్తున్న సిబ్బంది సేవలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వారి యొక్క సమస్యల తెలియపరచడానికి పోలీస్ అవుట్ పోస్టు ఉపయోగపడుతుందని తెలియజేశారు. స్పెషల్ బ్రాంచ్ సిఐ నరసింహారావు, నగరంపాలెం అధికారులు పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	33,403
మిర్చి ఎగుమతి	:	33,186
మిర్చి నిల్వ	:	11,872

మిర్చి ధరలు

రూపాయలలో

334	10,000 - 27,000
నెం.5	10,000- 27,500
341	12,000 - 26,000
నాన్ ఎసి	
తేజ	9,000- 23,000
బడిగి	13,000 - 27,000
దేవనూరు డీలక్స్	15,000 - 26,500
తాలుకాయలు	5,000 - 14,000
ఎసి	
334	10,000 - 27,000
నెం.5	10,000 - 26,000
341	16,000 - 27,500
తేజ	9,000 - 23,000
బడిగి	18,000 - 27,000
దేవనూరు డీలక్స్	21,000 - 21,000
తాలుకాయలు	4,500 - 12,500

'భ్రమర'అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా వినుకొండ మండలం తిమ్మాయిపాలెం రెవిన్యూ పరిధిలోని స్థానిక గుంటూరు కర్నూలు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న శ్రీ భ్రమర జిన్ సిటీ టౌన్షిప్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశాలతో వినుకొండ పోలీసులు విచారణ చేపట్టారు.

భ్రమరా జెన్సిటి వెంచర్ భూమి విస్తీర్ణం వివరాలు, వివిధ అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాల్సిందిగా విను కొండ తహశీల్దార్ ఉన్నతాధికారులు ఆదేశించడంతో తహశీల్దార్ కిరణ్ కుమార్ గత రెండు రోజులుగా విచారణ చేపట్టారు. వినుకొండ శ్రీ భ్రమర జెన్సిటీ ప్రైవేట్ లిమిటెడ్ వెంచర్ యాజమాన్యం అక్రమంగా మూడు సంవత్సరాల నుండి ప్రభుత్వం వ్యవసాయానికి అందిస్తున్న 9 గంటల విద్యుత్ సరఫరాను చోర్యం చేస్తూ అక్రమాలకు పాల్పడ్డారు. అందుకు వినుకొండ రూరల్ ఏఈ ఆనందరావు ప్రోత్సహిస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడడం వలన విజిలెన్స్ అధికారుల దాడుల్లో అవినీతిని నిగ్గు తేల్చి సస్పెండ్ చేయడం జరిగింది. భ్రమరా వెంచర్ వెనుక ఉన్న గుండ్లకమ్మ నది నుండి అక్రమంగా బోర్ ఏర్పాటు చేసుకొని ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించడంతో ఈనెల 15వ తేదీన మైనర్ ఇరిగేషన్ అధికారులు తనిఖీలు నిర్వహించి భ్రమరా వెంచర్ యజమానులు గుండ్లకమ్మ నీటి అక్రమ తరలింపుపై తహశీల్దార్‌కు నివేదిక ఇచ్చి ఫిర్యాదు చేశారు. దీనిపై వినుకొండ తహశీల్దార్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ శ్రీ భ్రమర జిన్ సిటీ ప్రైవేట్ లిమిటెడ్ వెంచర్ పై విచారణ జరుగుతుందని, వెంచర్ భూమి సర్వే చేస్తామని, అక్రమ నీటి తరలింపు పై జిల్లా కలెక్టరుకు నివేదిక ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆర్టిఐ ప్రొటెక్షన్ కౌన్సిల్ చేసిన సూచనల మేరకు ఆయా జిల్లాల్లో ఉన్న భ్రమరా జెన్సిటీ వెంచర్లపై అధికారులు విచారణ చేపడుతున్నారు.

'వృద్ధురాలి కంటి ఆపరేషన్‌లో మా నిర్లక్ష్యం లేదు'

డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి

ప్రజాశక్తి-నరసరావుపేట

వృద్ధురాలికి చేసిన కంటి ఆపరేషన్‌లో తమ నిర్లక్ష్యం లేదని , వృద్ధురాలి నిర్లక్ష్యం వలనే కన్ను తొలగించాల్సి వచ్చిందని ఎం.వి రెడ్డి కంటి హాస్పిటల్ అధినేత డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి అన్నారు. సోషల్‌మిడియాలో తమ పై తప్పుడు ప్రచారాలు నిర్వహించడం తగదని అన్నారు. గత నెలలో తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా పట్టణంలో ఒక వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధురాలి కంటికి శుక్లమ్ ఆపరేషన్ నిర్వహించామని అంతా బాగుందని వృద్ధురాలు చెప్పగా తిరిగి ఆశ్రమానికి పంపించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించామని కానీ ఆమె జాగ్రత్తలు తీసుకోక పోవడంతో ఆమె కంటికి ఇన్ఫెక్షన్ సోకి మళ్ళీ తమ హాస్పిటల్‌కు వస్తే పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ విషయం ఆమెకు తెలుపగా తగిన జాగ్రత్తలు తీసుకోలేకపోయానని స్వయంగా చెప్పి ఆవేదన వ్యక్తంచేసిందన్నారు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు కావాలనే సోషల్ మీడియాలో తమపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధురాలిని శంకర కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లి చూపించగా కన్ను తీసేయకపోతే ప్రాణానికి ప్రమాదమని ఈ నేపథ్యంలో కన్ను తొలగించారని తెలిపారు.తమపై తప్పుడు ప్రచారాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



సభలో మాట్లాడుతున్న టిటిడి చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి

చంద్రబాబు మాటలు ఎవరూ నమ్మరు

టిటిడి చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-మాచర్ల

చంద్రబాబు నాయుడు ఆయన దత్తపుత్రుడు ఇద్దరూ కలిసి కొత్త డ్రామాలు మొదలుపెట్టారని వారి మాటలు ఎవరూ నమ్మరని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వై వి సుబ్బారెడ్డి అన్నారు.ప్రభుత్వ విప్ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చిన్నాన్న కాంగ్రెస్ నాయకులు సుందర్ రామిరెడ్డి కాంస్య విగ్రహాన్ని ప్రారంభించేందుకు ఆయన ముఖ్య అతిథిగా మాచర్ల విచ్చేశారు. విగ్రహావిష్కరణ అనంతరం బుధవారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన నడుస్తుందన్నారు ప్రతి ఇంటికి నేరుగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. సుందర్ రామిరెడ్డి విగ్రహావిష్కరణకు రావడం ఆనందంగా ఉందన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సుందర్రామిరెడ్డి మాచర్ల నియోజకవర్గంలో ప్రజాధరణ కలిగిన నాయకుడని ఆయన తాము నడుస్తున్నామని తెలిపారు. మాజీ మంత్రిఅనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి 2024 ఎన్నికలలో ఒంటరిగానే అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తారని అన్నారు. నా భార్యను తిట్టారు అంటూ జనంలో సానుభూతి పొందేందుకు బాబు కొత్త డ్రామాలాడుతున్నాడని ఆ డ్రామాలను ఎవరు నమ్మవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నరసరావుపేట ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి, వైసీపీ నాయకులు ఎమ్మెల్సీ లేళ్లప్పిరెడ్డి ,గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, వైసీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి, నీళ్ల వెంకటరామిరెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు



సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బిఎస్ఎఫ్, బాలనంద ఎయిడెడ్ పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

పొన్నూరు మండలంలో బిఎస్ఎఫ్ ఎయిడెడ్ పాఠశాల, బాలనంద ఎయిడెడ్ పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖధికారి పి. శైలజ, జిల్లా ఉప విద్యాశాఖధికారి టి. సుధాకర్ రెడ్డిలు తనిఖీ చేశారు. ప్రభుత్వంలోకి విలీనం చేయుటకు సముఖంగా ఉన్నందున ఆయా పాఠశాల యొక్క అన్ని విషయాలు పరిశీలించారు. మండలంలోని నేతాజీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌ను సందర్శించి మండల విద్యాశాఖాధికారులతో చర్చించారు. బాలనంద స్కూల్ పోరంబోకు స్థలంలో ఉండటం వలన ఆ స్కూల్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారిని అసంతృప్తి వ్యక్తం చేశారు.



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు 'వాగ్దేవి' విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-నరసరావుపేట

బాస్కెట్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ చాటిన తమ కళాశాల బి.ఎస్.సి మొదటి సంవత్సరం విద్యార్థిని దేరం గుల అమూల్య జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కలశాల వాగ్దేవి కళాశాలల డైరెక్టర్ రాయల శ్రీనివాస రావు తెలిపారు. గత నెల 9న పిట్టలవానిపాలెం మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అండర్ -19 జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఆమె ఉత్తమ ప్రతిభకనబరిచి నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కలశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థినిని అభినందించారు. డిసెంబర్ 9న కేరళలోని క్యాలికట్‌లో జరిగే పోటీల్లో ఆమె మన రాష్ట్రం తరపున ఆడనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్రానికి, పల్నాడు జిల్లాకు,కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. అమూల్యను కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వం రావు, కపిలవాయి రాజేంద్ర ప్రసాద్, మద్దుల కోటేశ్వర రావు, పాశం కృష్ణారావు, ఇస్కెపల్లి కృష్ణకిషోర్, ఫిజికల్ డైరెక్టర్ మద్దాల సైదారావు తదితరులు అభినందించారు.



విద్యార్థుల మేధాశక్తికి సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి -పెదకూరపాడు

విద్యార్థుల మేధాశక్తిని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ దోహదం చేస్తుం దని మండలంలోని తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు అంకాళ్ళ శాంత భూలక్ష్మీ, పిసి చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి అన్నారు. పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో బుధవారం పాఠ శాల స్థాయి సైన్స్ ఫేర్ నిర్వహించారు. మ్యాథ్స్, బయాలజీ, ఫిజిక్స్ పాఠ్యాంశాలలో నమూనాలను విద్యా ర్థులు ప్రదర్శించారు. వీటిలో ఉత్తమ నమూనా ప్రదర్శనలను మండల స్థాయికి ఎంపిక చేసి పంపనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఉపాధ్యాయులు రెడ్డి, సుగుణవతి పర్యవేక్షించారు.

కెవిపిఎస్ నేటి మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- క్రోసూరు



క్రోసూరులో గురువారం జరగనున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం పల్నాడు జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.రవిబాబు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం గత మహాసభ నుండి ఇప్పటి వరకు దళితుల సామాజిక ఆర్థిక సమస్యలపై చేసిన కృషిని సమీక్షిస్తామన్నారు. ప్రస్తుతం వారు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు, వాటి పరిష్కారానికి కెవిపిఎస్‌గా ఏ విధంగా పనిచేయాలో, ఆందోళన, పోరాటాలను చేపట్టాలనే దానిపై ప్రణాళికను రూపొందించేందుకు ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రవి శంకర్ రెడ్డి

ప్రజాశక్తి-నరసరావుపేట

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసులను పల్నాడు జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి ఆదేశించారు. స్థానిక పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో అక్టోబర్ నెలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా జరిగిన నేరాలపై బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోక్సో కేసుల విచారణ సమయంలో మహిళా పోలీస్ అధికారి తప్పనిసరిగా ఉండాలని, యూనిఫారంలో కాకుండా సాధారణ దుస్తులలో ఉండాలని, ఏదైనా కేసుల్లో మైనర్లను విచారణ చేయాల్సి వస్తే వారిని పోలీస్ స్టేషన్‌లో విచారణ చేయవద్దని అన్నారు. మహిళలను రాత్రి సమయాల్లో పోలీస్ స్టేషన్లకు పిలిపించవద్దని, తప్పనిసరిగా విచారణ చేయాల్సిన నేపథ్యంలో మహిళా ఎస్సై లేదా కానిస్టేబుల్ ఉండాలని చెప్పారు. ఎస్సి,ఎస్టి కేసుల విచారణ సమ యంలో విచారణాధికారి బాధితులతో నేరుగా మాట్లాడాలని, విచారణ పేరుతో ఎవరిని పోలీస్ స్టేషన్లకి పిలిపించవద్దని ఆదేశించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు అన్ని పోలీస్ స్టేషన్లలో తప్పని సరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎస్పి ఆదేశించారు. గ్రేవ్ , నాన్ గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, చీటింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 సి.ఆర్.పి.సి కేసులు, పెండింగ్‌లో ఉన్న మిగిలిన కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, విజిబుల్ పోలీసింగ్ మొదలగు వివిధ అంశాలపై సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, వాటి పురోగతి, నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తుల తీరు తెన్నులు మొదలైన అంశాలపై ఆరా తీశారు. ఆయా కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ప్రణాళికాబద్ధంగా యు.ఐ కేసులను తగ్గించుకోవాలని, మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులు, ఫోక్సో కేసులలో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని, తగిన సాక్ష్యాధారాలతో నేరస్తులకు శిక్ష పడే విధంగా చేయాలన్నారు. ఆయా కేసుల ఛేదనకు, పరిష్కారానికి దోహదపడే కీలక మెళకువలను అధికారు లకు వివరించారు. ఇళ్లల్లో పగలు, రాత్రి సమయాలలో జరిగిన దొంగతనాలపై, చీటింగ్ కేసులపై, ప్రతి పోలీస్ అధికారి తమ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామాలపై దృష్టి సారించాలని అన్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నిందిత ులను త్వరగా పట్టుకొని చోరీ సొత్తును రికవరీ చేయాలన్నారు. గ్రామంలోని పరిస్థితులను, పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల కదలి కలపై నిరంతరం నిఘా పెట్టి, శాంతి భద్రతలను నెలకొల్పేందుకు చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాల కట్టడికి నిఘా వ్యవస్థను బలోపేతం చేసుకోవా లని, సైబర్ నేరాలు, దిశ యాప్ వినియోగం, మహిళల చట్టా లపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని చెప్పారు. కమ్యూ నిటీ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీ సింగ్ ద్వారా ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండా లన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం,క్రమశిక్షణ రాహిత్యం ప్రద ర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీలు జి.బిందుమాధవ్, రామచంద్ర రాజు (ఏఆర్)లు, నరసరావుపేట, సత్తెన పల్లి, గురజాల డిఎస్పీలు విజయభాస్కరరావు, విజయ భాస్కరరెడ్డి, జయరాం ప్రసాద్,దిశా డిఎస్పీ రవిచంద్ర, ఏఆర్ డిఎస్పీ చిన్నికృష్ణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మహిళా లోకానికి ఆదర్శం జడ్జి శ్రీదేవి

ప్రజాశక్తి-నరసరావుపేట

గుంటూరు జిల్లా 6వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏపీపీగా పనిచేస్తూ రాష్ట్రంలో నిర్వహించిన పరీక్షల్లో జూనియర్ సివిల్ జడ్జిగా, తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన పరీక్షల్లో జిల్లా జడ్జిగా ఎంపికైన పల్నాడు జిల్లా దిశా డిఎస్పీ యు.రవిచంద్ర భార్య రాచపూడి శ్రీదేవి జీవితాన్ని మహిళాలోకం ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ రవి శంకర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ శ్రీదేవికి వివాహమై పిల్లలు ఉన్నప్పటికీ పట్టుదలతో చదివి జిల్లా జడ్జి కావాలన్న తన ఆకాంక్షను నెరవేర్చుకున్నారని, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని ఆమె నిరూపించారని ప్రశంసించారు. పల్నాడు జిల్లాలో నేర దర్యాప్తు విభాగ డిఎస్పీగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీ అయిన డిఎస్పీ కమలాకర్‌ను కూడా సన్మానించారు. ఇటీవల తిరుపతిలో జరిగిన బ్రహ్మోత్సవాలలో వైసిపి ప్లీనరీ సమావేశాలలో విధులు నిర్వర్తించిన సత్తెనపల్లి డీఎస్పీ విజయ భాస్కర్‌రెడ్డిని, గురజాల డీఎస్పీ జయరాం ప్రసాద్‌ను దిశా డిఎస్పీ యు.రవిచంద్రను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.



ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకే 'ఫ్యామిలీ డాక్టర్': జెసి



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లాలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానాన్ని తీసుకు వచ్చిందని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్పందన హాల్ లో పల్నాడు జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మెరుగైన ఆరోగ్య సేవలను అందించిన పలువురు డాక్టర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఘనంగా సత్కరించారు. వైద్య అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికీ వెళ్ళి ఆరోగ్య సేవలను అందించేందుకు ఆన్లైన్ ద్వారా వివరాలను సేకరించి, వైద్య సేవలను అందిస్తున్నారని అన్నారు. దీర్ఘకాలిక వైద్య సేవలను అందిస్తునే రోగులకు మందులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. శస్త్ర చికిత్స చేయించుకున్న రోగులు, గర్భిణిల ఆరోగ్యం, అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే జిల్లాలో బాధ్యతగా పని చేస్తున్న ముగ్గురు వైద్యులు డాక్టర్ శ్యామల, దుర్గారావు, రవి తేజా నాయక్‌లను జేసి ఘనంగా సత్కరించారు. మిగతా డాక్టర్లు కూడా ఇదే తరహాలో వైద్య సేవలను అందించాలని సూచించారు.

టి.బి నివారణకు చర్యలు

ఇటీవల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిక్షయ మిత్ర అనే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నేపథ్యంలో జిల్లాలో టి.బి నివారణకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వారికి ఉచిత మందుల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వమే బాధ్యత తీసుకొని అందిస్తోందన్నారు. ఆరునెలల పాటు వారికి పౌష్టికాహారం ఆ రోగులకు తప్పని సరిగా అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ శివ శంకర్, ఇద్దరు రోగులకు ఆరు నెలలు పాటు వారికి పౌష్టికాహారం అందించేందుకు తగిన సహకారం అందిస్తున్నారని, జాయింట్ కలెక్టర్‌గా తాను ఇద్దరికి సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం రెండు వేలకు పైగానే టి.బి వ్యాధితో బాధపడుతున్న రోగులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారందరికీ ఉచితంగా పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని డాక్టర్లకు సూచించారు. కనీసం వెయ్యి మంది కైనా పౌష్టికాహారం అందించాలని కోరారు. ఇందుకు సంబంధించిన యాప్ వివరాలను జిల్లాలో ప్రభుత్వ వైద్యులు, ఇతర ఉద్యోగులకు పంపాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు లేని జిల్లాగా తయారు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వీరారాధనోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-కారెంపూడి



పల్నాటి వీరారాధ నోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మేకపోతు మేడగావు పెట్టడంతో రాచగావు కార్యక్రమం ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆచారవంతులు తమ కొణతములతో నిది మీదకు వచ్చారు. నాగులేరు (గంగాదారి మడుగు)లో స్నానం చేయించి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవయ్యవారు ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు వీర్ల దేవాలయంపై ఎర్రజెండా ఎగరవేశారు పీఠం నిర్వాహకులు బొగ్గరం విజయ్ పాల్గొన్నారు.

రైతుల్లో ఉత్తేజం నింపేందుకే ఎడ్ల పందేలు

పల్నాటి వీరారాధనోత్సవాలల్లో భాగంగా వైసిపి ఆధ్వర్యంలో జరిగే రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలను మాచర్ల శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాలలో రైతులను ఉత్తేజపరిచేందుకే ఎడ్ల పందేలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీలను కొంచెం సేపు ఆయన తిలకించారు. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను కూడా పిన్నెల్లి ప్రారంభించారు. పోటీలలో పాల్గొన్న ఎడ్లకు సం



బంధించిన రైతులకు ఉచితంగా పశు వైద్య పరికరాల కిట్లను అందించారు అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామకృష్ణారెడ్డికి నిర్వాహకులు ప్రజాప్రతి నిధులు కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి మేకల శారద శ్రీనివాస్‌రెడ్డి, కారెంపూడి సర్పంచ్ ప్రమీలబాయ్ తేజ నాయక్,జడ్పిటిసి షేక్ షఫీ, వైసిపి కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, యూత్ అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలి

రాజధాని కార్మికుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు - ఐదవ రోజు దీక్షలు ప్రారంభించిన జొన్నా శివశంకరరావు

ప్రజాశక్తి - తుళ్లూరు : పని భద్రత కల్పించాలని,పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ స్థానిక సి ఆర్ డి ఎ కార్యాలయం వద్ద రాజధాని 29 గ్రామాల పారిశుధ్య కార్మికులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు బుధవారంతో అయిదవ రోజుకు చేరాయి. సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు హౌస్ కీపింగ్ కార్మికులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలను రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ఆందోళనకు ఏపీ రైతు సంఘం సంపూర్ణ మద్దతు నిస్తుందని, వారి ఆందోళనలో ప్రత్యక్షంగా పాల్గొంటా మన్నారు. ముఖ్యమంత్రి నివాస ప్రాంతానికి కూతవేటు దూరంలో ఉన్న రాజధానిలోని కార్మికుల ఆక్రందనలు ముఖ్యమంత్రికి వినపడటం లేదా అని అన్నారు. నాలుగో నెల గడుస్తున్నా ఇప్పటివరకు జీతాలు చెల్లించకపోవడం, ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కనీసం స్పందించి సమాధానం కూడా చెప్పకపోవడం దుర్మార్గమని అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. కార్మికులు, కర్షకులు సంతోషంగా ఉంటేనే దేశం అభివద్ధి చెందుతుందని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కార్మికులని, కర్షకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. రాజధాని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికులపై ప్రభుత్వం కక్ష కట్టి జీతాలు చెల్లించకుండా రానున్న జనవరి నుండి పని నుండి కూడా తొలగించే దానికోసం పూనుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కషి చేయాలని కోరారు. రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ



మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

కార్మికుల కంటనీరు పెట్టించిన ఏ ప్రభుత్వం బ్రతికి బట్టకట్టిన చరిత్ర లేదని అటువంటి గతి ఈ ప్రభుత్వం తెచ్చుకోవద్దని హెచ్చరించారు. రాజధాని గ్రామాల ప్రజల ఆరోగ్యం కొరకు నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల న్యాయమైన కోర్కెల పరిష్కారానికి, ఆందోళనలకు రాజధాని గ్రామాల ప్రజానీకం సంపూర్ణ మద్దతు తెలియ చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు, సంఘం నాయకులు వీర్లంకమ్మ, శిరీష, శివమ్మ, తిరుపతమ్మ, మరియమ్మ, విజయ కుమారి, గురవయ్య, దేవదాసు, రామాంజనే యులు, అరుణ్ కుమార్, సాంబయ్య, రజిని, ముత్యాలు, రమణ, జ్యోతి, కుశాల్ రావు, పుష్పరాజు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును తీవ్రంగా నిరసించిన టిడిపి

-'ఇదేం ఖర్మ' పేరిట భారీ ర్యాలీ..విద్యుత్ కార్యాలయం ముందు బైఠాయింపు

-జగన్ చేతగాని పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తిన మాజీ మంత్రులు

ప్రజాశక్తి-తెనాలి: మూడున్నరేళ్ళ వైసిపి పాలనలో అన్ని రంగాలను నిర్వీర్యం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని, చేతగాని పాలనకు ఇంతకన్నా నిదర్శనమేముందని మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనందబాబు ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ స్థానిక కొత్తపేటలోని పార్టీ కార్యాలయం నుంచి చెంచుపేట విద్యుత్ ఈఈ కార్యాలయం వరకూ బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈఈ కార్యాలయం ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ వైసిపి పాలనలో సామాన్యుల బతుకులు చిన్నాభిన్నమయ్యాయని, దీనికి తోడు పన్నుల భారం వారి జీవన ప్రమాణాలను మరింత దిగజార్చుతోందన్నారు. విద్యుత్ సంస్కరణల పేరిట దాదాపు రూ.2600 కోట్లు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. పాత టారిఫ్‌లతో పోల్చితే ప్రతి ఒక్కరికి 40 నుంచి 50 శాతం బిల్లులు పెరిగాయన్నారు. ఇది చాలదన్నట్లు ట్రూఅప్ చార్జీల పేరిట దాదాపు రూ.2910 కోట్లు ప్రభుత్వం వసూలు చేసిందన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తికి సరిపడా జలాశయాల్లో నీరున్నా, విద్యుత్ హాలిడే ఇచ్చే పరిస్థితి ఈప్రభుత్వంలో దాపురించిందన్నారు. టిడిపి హయాంలో విద్యుత్ లోటును అధికమించి, మిగులు విద్యుత్‌ను చూపారని, నాణ్యమైన విద్యుత్ సంస్కరణలకు బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబునాయుడు నిలిచారన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించకుండే



విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద బైఠాయించిన ఆలపాటి, నక్కా, శ్రావణ్‌కుమార్ తదితరులు

ఆందోళన తప్పదన్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి మాణిక్యరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తీసుకు వచ్చిన విద్యుత్ బిల్లులను నాయకులు విద్యుత్ ఈఈ చిరంజీవికి చూపించి, గతంలో ఉన్న బిల్లు, పెంచిన తరువాత వచ్చిన బిల్లుల వ్యత్యాసాన్ని వివరించారు. ఏ దామాషా ప్రకారం లెక్కకు మించి పెరిగాయో చెప్పాలని కోరటంతో, పరిశీలించి చర్యలుతీసుకుంటామని ఆయన బదులిచ్చారు. కార్యక్రమంలో నాయకులు టి.హరిప్రసాద్, దివి అనిత, ఎన్ జయలక్ష్మి, జెట్టి రేణుక, జె.మహేష్, కె.కనకరాంబాబు, కె.రమాదేవి, పి.రమ్య, బ్రహ్మేశ్వరరావు, వంగా సాంబిరెడ్డి, మహ్మద్ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

ఊపిరితిత్తులు భద్రం... భద్రం!



పెరుగుతున్న ఊపిరితిత్తుల సమస్యల బాధితులు

ముందు జాగ్రత్తలతో నివారణ

డాక్టర్ బి దుర్గాప్రసాద్,

ప్రముఖ పల్మనాలజిస్ట్, గుంటూరు



మనం ఏ పని చేసినా, చేయకపోయినా శ్వాస తప్పనిసరిగా తీసుకుంటేనే ప్రాణాలతో ఉంటాం. ఈ విషయం అందరికీ తెలిసిందే. మనం శ్వాస తీసుకోవడంలో ఎంతో కీలకమైనవి ఊపిరితిత్తులు. ప్రతి మనిషి సాధారణంగా రోజులో దాదాపు 25,000 సార్లు ఊపిరి తీసుకుంటాడు. మనం పీల్చే గాలిలో ఆక్సిజన్, నత్రజని, తక్కువ మొత్తంలో ఇతర వాయువులు, బ్యాక్టీరియా, వైరస్ మొదలైనవి ఉంటాయి. ఊపిరితిత్తులు ఆక్సిజన్‌ను శరీరమంతా పంపిణీ చేస్తాయి. స్పీడ్ యుగంలో మారుతున్న జీవనశైలి, అలవాట్లు, పని ప్రదేశాలు, అవలంభిస్తున్న పద్ధతుల కారణంగా ఊపిరితిత్తుల సమస్యల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నవారి సంఖ్య అధికంగానే ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా అక్టోబరు నెలను 'హెల్దీ లంగ్స్ మంత్'గా నిర్ణయించి ఊపిరితిత్తుల వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడే వారికి వైద్యం చేసే వైద్య నిపుణులను పల్మనాలజిస్టులు అంటారు. గుంటూరు జిల్లాలో 40 మంది పల్మనాలజిస్టులు వైద్యసేవలందిస్తున్నారు. ప్రపంచాన్ని వణికించిన కోవిడ్ బారిన పడ్డ వారికి, కోలుకున్న వారిలో కొంతమందికి పోస్ట్ కోవిడ్ కాంప్లికేషన్స్ వస్తున్న వారికి పల్మనాలజిస్టులు సకాలంలో వైద్యం అందించి వారి ప్రాణాలు రక్షిస్తున్నారు. ఊపిరితిత్తుల వ్యాధులను సకాలంలో గుర్తించి వైద్యం పొందితే కోలుకుని తిరగవచ్చు.

ఎక్కువగా దగ్గు, ఆయసం, పిల్లికూతలు, ఛాతి పట్టివేయడం లాంటి లక్షణాలు కనిపిస్తే సిఒపిడి వ్యాధిగా గుర్తించాలి. ఎవరికైనా తరచుగా జలుబు చేయడం, దురద, కళ్ళు మంటలుగా ఉండటం, కొన్ని రకాల ఆహార పదార్థాలు, వాసనలు సరిపడకపోవడం వంటి లక్షణాలు దానిని ఎలర్జీగా గుర్తించాలి. ఇక, జ్వరం రావడం,కళ్లెతో కూడి దగ్గు, శ్వాస తీసుకునే సమయంలో ఛాతి నొప్పి పుట్టడం వంటి లక్షణాలు ఉంటే నియోనియాగా, రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే ఊపిరితిత్తులకు వచ్చే క్షయగా గుర్తించాలి. దగ్గుతున్నప్పుడు నోటి నుంచి రక్తం పడుతుండటం, క్రమంగా శరీర బరువు తగ్గుతుండటం, ఆకలిలేకపోవడం వంటివి లంగ్ కేన్సర్ లక్షణాలు. పొడి దగ్గు, ఆయాసం, కీళ్ల నొప్పులు కనుక ఉంటే ఊపిరితిత్తులకు వచ్చే ఐఎల్‌డి వ్యాధిగా గుర్తించాలి. ఊపిరితిత్తుల బారిన ఎటువంటి వ్యక్తులు పడతారంటే.. ధూమపానం చేసే వారు, పొగాకు ఉత్పత్తులు వినియోగించేవారు, ఫ్యాక్టరీల్లో పనిచేసేవారు, పొగతో కూడిన వాహనాల పనులు, మరమ్మతులు చేసేవారికి ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయి.

ముందస్తు జాగ్రత్తలతో నివారణ

ముందస్తు జాగ్రత్తలతో లంగ్స్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని ప్రముఖ పల్మనాలజిస్ట్ బి దుర్గా ప్రసాద్ తెలిపారు. ఊపిరితిత్తుల వ్యాధులను ముందస్తు జాగ్రత్తలతో చాలా వరకు నివారించవచ్చు. గుట్కా, పాన్‌పరాగ్, ఖైనీ, ధూమపానం వంటివి మానుకోవాలి. దుమ్ము, ధూళి ప్రాంతాల్లో పని చేసే వారు మాస్కులు తప్పనిసరిగా ధరించడం వల్ల ఊపిరితిత్తులకు ఇబ్బంది కలగకుండా చూడొచ్చు. మంచి ఆహారపు అలవాట్లు కలిగిఉండటం, అలర్జీ కలిగించే పదార్థాలను దూరంగా ఉంచాలి. అంతేకాకుండా, ప్రతిరోజు కనీసం అరగంటపాటు వ్యాయామం చేయడం, ప్రాణాయామం చేయడం ద్వారా ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. అరవై ఏళ్ళ పైబడ్డ వారంతా క్రమం తప్పకుండా ఫ్లూ, నిమోనియా వ్యాక్సిన్లు తీసుకోవడం ద్వారా ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చు.

ప్రజాశక్తి - గుంటూరు



పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - మంగళగిరి

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో యువ జనోత్సవాల సందర్భంగా మంగళగిరి కి చెందిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి, వెయిట్ లిఫ్టర్ సంధాని కుమార్తె, సాదియా ఆల్మాస్‌కు రూ.3లక్షల ఆర్థిక సహాయం బుధవారం అందించారు. న్యూజిలాండ్‌లో జరగబోతున్న కామన్ వెల్త్ గేమ్స్‌లో ఎంపికైన సాదియాకు ఖర్చుల నిమిత్తం మంగళగిరి రోటరీ క్లబ్ సౌజన్యంతో, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ మెంబర్ అయినటువంటి బి జి ఆర్ గ్రానైట్స్ డైరెక్టర్ రొటేరియన్ కార్తీక్ రెడ్డి రూ. మూడు లక్షల నగదు మంగళగిరి క్లబ్ ద్వారా పవర్ లిఫ్టర్ సాదియా ఆల్మాస్‌కు స్పాన్సర్ చేశారు. రోటరీ జిల్లా 3150 ట్రైనర్ రత్న ప్రభాకర్ చెక్‌ను సాదియాకు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు త్రిపురమల్లు సతీష్ బాబు, కోశాధికారి గాజుల శ్రీనివాసరావు, క్లబ్ ట్రైనర్ అనిల్ చక్రవర్తి పాల్గొని కామన్వెల్త్ పోటీలలో పాల్గొనబోతున్న సాదియా ఆల్మాస్ విజేతగా నిలవాలని స్వర్ణ పథకం గెలిచి మంగళగిరి కి రాష్ట్రానికి దేశానికి కీర్తి ప్రతిష్టలు తేవాలని శుభాకాంక్షలు తెలిపారు.



వ్యాపార దుకాణాలపై దాడులు

నిషేధిత క్యారీ బ్యాగులు విక్రయించినందుకు రూ.14,500 జరిమాన

ప్రజాశక్తి - మంగళగిరి : నిషేధిత క్యారీ బ్యాగులు వినియోగించే వ్యాపార సంస్థలపై అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎంటిఎంసి పరిధిలోని మంగళగిరిలో బుధవారం అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి ఆధ్వర్యంలో పలు వ్యాపార సముదాయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో 20 కిలోల నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నామని, యజమానులకు రూ. 14,500 జరిమానా విధించామని లక్ష్మీపతి తెలిపారు.110 మైక్రాన్ల కన్నా ఎక్కువ ఉన్న క్యారీ బ్యాగులను మాత్రమే వినియోగించాలని ఆయన సూచించారు. సాధ్యమైనంత వరకు జూట్ బ్యాగులను మాత్రమే వాడాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

కిక్కిరిసిన విద్యార్థులతో ఆటోలు

ప్రజాశక్తి - తాడేపల్లి



తాడేపల్లి నెహ్రూబొమ్మ సెంటర్ వద్ద ఆటోలో

తాడేపల్లి పట్టణంలో వివిధ పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్ళే ఆటోలు కిక్కిరిసి వెళుతున్నాయి. పరిమితికి మించి విద్యార్థులను ఆటోల్లో వస్తువుల్లాగా కుక్కి మరీ ప్రయాణం చేయిస్తున్నారు. పుస్తకాల బ్యాగులు ఒక పక్క....విద్యార్థులు మరోపక్క...ఆటోలో ఉండవలిసి రావడంతో ఒకరిపై ఒకరు కూర్చొని ప్రయాణించే పరిస్థితి ఏర్పడింది. ఆటోకు ఉన్న వెనుకడోర్లు తీసి దానిమీద కూడా విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. ఇక డ్రైవర్ సీటు పక్కన అదనంగా విద్యార్థులు కూర్చోవడం సరేసరి...ఆటోల్లో విద్యార్థులు ప్రయాణం చూసిన పలువురు పట్టణ ప్రముఖులు ముక్కున వేలేసుకుంటున్నారు. జరగరానిప్రమాదం జరిగితే అటు విద్యార్థుల తల్లిదండ్రులకు, ఇటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఇబ్బంది పరిస్థితి వచ్చే అవకాశం కనిపిస్తుందని పట్టణ ప్రముఖులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

'క్షయ' నివారణకు కృషి: కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ప్రధాన మంత్రి ముక్తా భారత్ 'నిక్షయ యాప్' కార్యక్రమం ద్వారా టి.బి రోగులకు రిజి స్ట్రేషన్ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా చర్యలు తీసు కోవాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో టి.బి నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. దాతలు ఉదారంగా స్పందించి ఒక్క రోగికి నెలకు రూ.700 చొప్పున 6 నెలల పాటు చెల్లించి రోగులను ఆదుకొని క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2వేల మందికి పైగా జిల్లాలో ఉన్నారని తెలిపారు. దాతల రిజిస్ట్రేషన్ విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అందరికీ అర్థమయ్యేలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వివరించారు. ఈ నెల 26న భారీ స్థాయిలో జరిగే కార్యక్రమం నాటికి రిజిస్ట్రేషన్ కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి మండలం, నియోజక వర్గం వారిగా క్షయ వ్యాధి రోగుల సంఖ్యను ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ వివరాలను తెలియజేశారు. దాతలు పౌష్టికాహారం అందించే క్రమంలో పూర్తి స్థాయి వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇచ్చిన ఫోన్ నంబరుకు, లేదా నేరుగా నిక్షయ యాప్ ద్వారా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టరు శోభా రాణి, జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారిణి డాక్టరు పద్మా వతి,పలువురు వైద్యులు, ప్రోగ్రామ్ మేనేజర్ రాజా రమేష్, ఆయా శాఖల అధికారులు, ఎన్. జి. ఓ సంస్థలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

శావల్యాపురంలో సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి- వినుకొండ

శావల్యా పురం మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. గ్రామస్తులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేశారు. ముత్తుకుమల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. భోజన వసతి ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసు కున్నారు. వంటశాలను, మెనూ ప్రకారం భోజనం పథకాన్ని పరిశీలించారు. నాడు- నేడు కార్యక్రమం కింద అభివృద్ధి చేసిన పనులను, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పాడుబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తొలగించేందుకు అనుమతి జారీ చేశారు. ఈ మేరకు పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇం జనీర్ సర్వ శిక్ష అభియాన్ అసిస్టెంట్ ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సంబంధించి త్వరి తగతిన ప్రహరీ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఎస్సీ కాలనీకి చెందిన 26 మందికి తక్షణమే ఇంటి పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ అధికారిని ఆదేశించారు. శ్మశాన వాటికకు సం బంధించి ఆర్ ఎస్ ఆర్ ప్రకారం ఎంత మేరకు పరిధి ఉన్నదో గుర్తించి తదనుగుణంగా ప్రహరీ నిర్మించాలని సం బంధిత పంచాయతి సెక్రటరి, సర్పంచ్‌కు సూచించారు. ఊర చెరువు విషయమై ప్రజలతో చర్చించి సమస్యలు పరిష్కరించేలా చూడాలని ఆదే శించారు. శావల్యాపురం సచివాలయం సందర్శించి సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ సర్వే పై వివరాలు సేకరించారు. అదేవిధంగా నిక్షయమిత్ర సర్వేను వేగవంతం చేయాలని సచి వాలయ వాలంటీర్లకు, సిబ్బందికి ఆదేశించారు.

కలెక్టర్ బంగ్లా నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా నరసరావుపేటలో శరవేగంగా రూపుదిద్దుకుంటున్న కలెక్టర్ బంగ్లాను కలెక్టర్ శివశంకర్ బుధవారం ఉదయం పరిశీలించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాటి కలెక్టర్ పెద్ద చెరువు బైపాస్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ భవనంను నూతనంగా ఏర్పాటు అయిన పల్నాడు జిల్లా కలెక్టర్ బంగ్లా క్యాంప్ కార్యాలయానికి కేటాయించారు. మరమ్మతు పనులను రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టే లా ఆదేశాలు జారీ చేశారు. సదరు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులపై పలు సూచనలు సలహాలు తెలియజేశారు. పనుల నాణ్యతను పరిశీలించారు. ఆర్ అండ్ బి ఇంజనీర్ రాజా నాయక్, నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర, మండల రెవెన్యూ అధికారి రమణ నాయక్ పాల్గొన్నారు

20వ వార్డులో సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక 20వ వార్డు విశ్వబ్రాహ్మణ వీధిలో పలు సమస్యలతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. మురుగునీరు పోయే మార్గం, విద్యుత్ సరఫరా, తాగు నీరు లేకపోవడం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. అదే వీధిలో వున్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర నుండి ఆ సందు చివరి వరకూ పైపులైను వేస్తామని ఎనిమిది రోజుల క్రితం మున్సిపల్ అధి కారుల సమక్షంలో గుంతలు తీశారు. గుంతలు తీసిన మట్టిని వాటర్ పైపులపై వేశారు. కాలువల్లో కూడా ఆ మట్టిని పోయడంతో మురుగునీరు పారేం దుకు వీలు లేకుం డా చేశారు. దీంతో, మురుగు నీరు రోడ్ల పైకి వచ్చి చేరు తోంది. అదే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నెల రోజు లుగా రెండు వీధి లైట్లు వెలగడం లేదు. ఆ సందు చీకటిగా ఉండటం, రోడ్లపై చేరిన మురుగునీరు, గుంతల వల్ల అటుగా వెళ్లే వారికి తీవ్ర అసౌకర్యంగా ఉంది. సంబంధిత అధికారులు వెంటనే స్పం దించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధి పనుల తనిఖీలు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో జరిగిన ఉపాధి హామీ పనుల తనిఖీ చేపట్టినట్లు ఎస్ఆర్పి లక్ష్మణరావు బుధ వారం తెలిపారు. మండలంలో 2020-21,2021-22 కాలంలో రూ. 17 కోట్ల రూపాయల ఉపాధి హామీ పనులు జరిగాయన్నారు.గ్రామ పంచాయతీల వారీగా ఆరుగురు డిఆర్పిలు ఆయా పనులను తనిఖీ చేసి అనంతరం గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-యడ్లపాడు

స్థానికంగా బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. లింగారావుపాలెం సర్పంచ్ షేకే. కారిమూన్ మహబూబ్ సుభాని సహకారంతో, కాటూరి మెడికల్ కాలేజ్ , హాస్పిటల్ ఆధ్వర్యంలో 20 మంది వైద్యులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వందమందికి పైగా ఓపీ లకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి టి. వీర రాఘవయ్య, గ్రామ పెద్దలు ఎన్.శివరామ కృష్ణ, కె.సీతారామయ్య తదితరులు ఉన్నారు.

ప్రతి ఇంటి నుండి లక్ష దోచుకుంటున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- వినుకొండ

వివిధ రకాల పన్నులు విధించి రాష్ట్రంలోని ప్రతి ఇంటి నుండి లక్ష రూపాయలు జగన్‌రెడ్డి ప్రభుత్వం దోచు కుం టోందని, ఇటువంటి ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలు తరిమి కొట్టాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీ.వీ.ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని రెడ్డినగర్ 31వ వార్డులో బుధవారం పట్టణ పార్టీ అధ్యక్షతన బాదుడే- బాదుడు కార్యక్రమం నిర్వహించారు.

పిఎంజెజెబివై కింద రూ.2 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-చిలకలూరిపేట: ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకం కింద రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ క్లెయిమ్ మంజూరైనట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇం డియా బజార్ బ్రాంచ్ మేనేజర్ పి. జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పురుషోత్త పట్నంకు చెందిన పద్మావతికి తమ శాఖలో సేవింగ్స్ ఖాతా ఉన్నట్లు, ప్రతి ఏటా పిఎంజెజెబివై పథకానికి సదరు ఖాతా నుంచి రూ.436 ప్రీమియం చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ఆమె మృతి చెందటంతో రెండు లక్షలు మంజూరైనట్లు చెప్పారు. చెక్కును ఆమె భర్త ఎ.హరినాథ్ బాబుకు అందజేశారు.

సేంద్రియ ఉత్పత్తులే శ్రేయస్కరం

ప్రజాశక్తి-నరసరావుపేట: సేంద్రియ విధానంలో పండించిన పంట ఉత్పత్తులు శ్రేయస్కరమని మార్కెట్ లో కూడా ప్రకతి వ్యవసాయ ఉత్ప త్తులకు మంచి గిరాకీ ఉందని ప్రకతి వ్యవసాయ జిల్లా ప్రాజె క్టు మేనేజర్ కె.అమల కుమారి అన్నారు. బుధవారం మండలంలోని కొండకావూరులో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పొలాలను అమల కుమారి, లాం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం గంగాదేవిలు కలిసి సందర్శించారు.

జానపాడు రోడ్డు బాధితులకు ప్రత్యామ్నాయం చూపండి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల


జానపాడు రోడ్డు బాధితులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

పట్టణంలో జానపాడు రోడ్ మార్జిన్ లో ఏళ్ల తరబడి నివసిస్తున్న పేదలను ప్రత్యామ్నాయం చూపించే వరకు ఇళ్ల తొలగింపు ఆపాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జానపాడు రోడ్డు బాధితులతో పాటు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును కలిసి సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సం దర్భంగా గోపాలరావు మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా పేదలను తొలగించేందుకు పురపాలక సంఘం నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. వీరంతా రోజువారి రెక్కల కష్టం చేసుకుని బ్రతికే పేదలని, సామాజికంగా వెనుకబడిన వర్గాల వారు కనుక ప్రత్యామ్నాయం చూపించి వారికి న్యాయం చేయాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి తెలకపల్లి శ్రీను మాట్లాడుతూ బాధితు లందరికీ న్యాయం జరిగే వరకూ సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జానపాడు రోడ్డు బాధితులు పాల్గొన్నారు.

న్యాయవాది దారా చెన్నయ్యకు బార్ అసోసియేషన్ ప్రశంసలు



ప్రజాశక్తి-పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పరిసర ప్రాంతాల్లో అనేక సేవలు అందించిన పల్నాడు న్యాయవాది దారా చెన్నయ్య,ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో తెలుగు జాతి సత్తా చాటడం హర్షించదగ్గ విషయమని పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ ప్రశంసించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ సభ్యులు సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ కారంపూడి మండలంలోని చింతపల్లిలో పుట్టిన ఆయన న్యాయ వాదిగా అనేక సేవలందించారన్నారు. మనిషి సామర్థ్యానికి కులాలు, మతాలు, ప్రాం తాలు అడ్డు రావని కన్నమ్మ దాసు వారసుడిగా, అంబేద్కర్ ఆశయ సాధనకు తన న్యాయవాది పటిమను మన రాష్ట్రంలోనే కాకుండా ఒరిస్సా రాష్ట్రంలో కూడా నిరూపించారని కొనియాడారు. చెన్నయ్య కృషికి సీనియర్ న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నడక బృందం సేవలను విస్తరించాలి

ప్రజాశక్తి-మాచర్ల : నడక బృందం సేవలను విస్తరించాలని డాక్టరు యరమల రామ చంద్రారెడ్డి సూచించారు. స్థానిక శ్రీ కోదండరామాలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని గత 30 రోజులుగా జరుగుతున్న అన్నదాన కార్యక్రమం ముగింపు సమావేశం జరిగింది. డాక్టరు మోహనరావు, వైస్ చైర్మన్ పోలూరి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక లాభాలు

ప్రజాశక్తి-బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ విధానంలో ప్రధాన పంటతో పాటు పలు అంతర పంటలు వేయడం ద్వారా రైతుకు అధిక లాభాలు పొందవచ్చని క్రోసూరు డివిజన్ మాస్టర్ ట్రైనర్ టీ సైదయ్య అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం రైతు భరోసా కేంద్రంలో బుధవారం క్రోసూరు డివిజన్‌కు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు.సమావేశంలో ఎస్‌డిఎ అనంతలక్ష్మి, ఎంసిఆర్‌పి అంజలి,విఎఎ అయ్యప్ప పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి-చిలకలూరిపేట



ఐఎస్ఒ సర్టిఫైడ్ ఆర్గనైజేషన్ ప్రముఖ ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గోవింద రావుకు 'శ్రీసాయి భారత్' ఉత్తమ సేవా పురస్కారం బుధవారం అందజేశారు. చిలకలూరిపేటలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పట్టణంలో పారిశుధ్యం, పరిశుభ్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వహించేటట్లు చూస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజి ప్రశంసించారు. అందుకు తగురీతి లో గౌరవిస్తూ, ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ రెవిన్యూ సెక్షన్ లో ఉద్యోగి షేక్ ఖాదర్ కు ప్రశంసపత్రం అందజేసి సత్కరించినట్లు చెప్పారు.

దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-రొంపిచర్ల



మండల కేంద్రమైన రొంపిచర్లలో దుకాణాలను బుధ వారం తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీ చేశారు. తూనికలు కొలతల శాఖ ఇన్ స్పెక్టర్ ఎన్. అల్లూరయ్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. బేకరీ షాపులను, కిరాణా దుకాణాలను, హోటళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తూనికలు కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ అల్లూరయ్య మాట్లాడుతూ షాపులలో వినియోగదారులకు సరుకులు ఇచ్చేటప్పుడు నిష్పక్షపాతంగా కాటా వేసి ఇవ్వాలని అన్నారు. షాపుల యజమానులు సరుకుల వినియోగానికి ఉపయోగించే కాటాకు ప్రభుత్వం నుండి లైసెన్స్ పొందాలని అన్నారు. షాపులలో ప్రభుత్వం వారి ముద్ర ఉన్న కాటాలను వినియోగించాలని అన్నారు. ఆ విధంగా కాటాలు లేకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఎన్.జి.ఓ తాలుకా అధ్యక్షులుగా గిరిరాజు నర్సింహబాబు



ప్రజాశక్తి-మాచర్ల : మాచర్ల తాలుకా అధ్యక్షులుగా గిరిరాజు నర్సింహబాబును ఏకగ్రీవంగా ఎన్నికైనారు. బుధవారం జరిగిన ఎన్.జి.ఓ తాలుకా కార్యవర్గ సమా వేశంలో గిరిరాజు నర్సింహబాబును కార్యవర్గ సమావేశం అధ్యక్షులుగా ఎన్నుకుంది. ఇప్పటివరకు అధ్యక్షులుగా పని చేసిన సూరి గుంటూరుకు బదిలీ కావటంతో నర్సింహబాబు బుధవారం నుండి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. అడిగొప్పల నిదానంపాటి అమ్మవారి ఆలయ ఇఒగా పని చేస్తున్న గిరిరాజు నర్సింహబాబు ఎపి ఎన్.జి.ఓ నూతన అధ్యక్షులుగా ఎన్నిక కావటంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, గుంటూరు సిటి యూనిట్ అధ్యక్షులు ఎస్.పి.ఎస్ సూరి తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుని అభినందించారు.

పెదకూరపాడులో అన్నదానం

ప్రజాశక్తి- పెదకూరపాడు: పెదకూరపాడు, సత్తెనపల్లి లోని అనాథాశ్రమాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం మండల టిడిపి అధ్యక్షులు రమేష్ పుట్టినరోజు సందర్భంగా పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రోగులకు పండును పంపిణీ చేశారు.



డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్న బి. లవీన్

ప్రకృతి వ్యవసాయంపై డ్వాక్రా మహిళలకు అవగాహన

ప్రజాశక్తి-కొల్లిపర

ప్రకతి వ్యవసాయంపై డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం స్థానిక మండల పరిదిలోని పుట్టపర్తి పాలెం గ్రామంలో నిర్వహించినట్లు కొల్లిపర యూనిట్ మాస్టర్ ట్రైనర్ బి.లవీన్ తెలిపారు. మండల పరిధిలోని పుట్టపర్తి పాలెం గ్రామం మహిళా విఓలు లలిత, గ్రామలక్ష్మీ , తిరుపతమ్మ, ప్రవల్లికలు డ్వాక్రా గ్రూప్ సభ్యులకు దశ పర్ని కషాయం తయారు చేయడం నేర్పించారు. ఈ సందర్భంగా లవీన్ మాట్లాడుతూ పంటలకు ఆశించిన ఏ రకమైన పురుగులైన నశింప చేసేందుకు ఈ దశపర్ని కషాయం పనిచేస్తుందని తెలిపారు. కావున రైతులు ఈ కషాయం తయారు చేసుకోవడం నేర్చుకోవాలని తెలిపారు. రైతులకు రసాయనిక వ్యవసాయం చేయటం వలన కలిగే నష్టాలు ప్రకతి వ్యవసాయం చేయడం వలన కలిగే లాభాల గురించి వివరించారు అనంతరం పురుగు ఆశించిన పంటపై కషాయం చల్లి పురుగు చనిపోవటాన్ని చూపించారు. కార్యక్రమంలో బి.మాధురి, రైతులు, లీడ్ ఫార్మర్లు పాల్గొన్నారు



మాట్లాడుతున్న నారా లోకేష్

గెలిపిస్తే ఇళ్ల పట్టాలు ఇస్తా..

'బాదుడే బాదుడు'లో నారా లోకేష్

ప్రజాశక్తి - తాడేపల్లి

వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న వారందరికీ ఇళ్ళపట్టాలు ఇస్తానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రజలకు హామీ నిచ్చారు. రాజధానిలో భాగమైన పెనుమాక గ్రామంలో బుధవారం ఆయన బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ప్రజలపై మోపిన భారాలను వివరించారు. ఇటీవల మృతిచెందిన టిడిపి కార్యకర్తల ఇళ్ళకు వెళ్ళి పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని, తమ పింఛన్లు తొలగిస్తున్నారని వృద్ధులు లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. గత ఎన్నికల్లో లోకేశ్ గెలిస్తే ఇళ్ళు కూల్చేస్తారని తనపై దుష్ప్రచారం చేసి గెలిచిన ఎమ్మెల్యే ఆర్‌కె నేడు పేదల దుకాణాలు, అవసరం లేకున్నా ఇళ్ళు కూల్చేస్తున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు అమరా సుబ్బారావు, కొల్లి శేషు, పాలెపు వీరేంద్రనాథ్, ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రత్నం



మాట్లాడుతున్న శ్రీలత వాణి

మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-కొల్లపర

రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని లాం ఫారం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రత్నం తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మున్నంగి-2 ఆర్‌బికేలో ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ)తో కలిసి వ్యవసాయ అధికారులు రైతులకు డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి - మేలైన యాజమాన్య పద్ధతులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రత్నం మాట్లాడుతూ 250 ఎకరాల మాగానీ పొలాన్ని ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి పొలం బడి ద్వారా రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించేలా వారికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డిడిఏ,డిఆర్‌సి పి రామాంజనేయులు, ఏడిఏ,డిఆర్‌సి ప్రవీణ, సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ క్వాలిటీ మేనేజర్ యుగంధర్, మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ నాయక్, మండల వ్యవసాయ అధికారి వెంకట్రావు, రైతుల పాల్గొన్నారు

అపరాలలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

మండలంలోని మునుకుదురులో బుధవారం ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వావిద్యాలయ ఎరువాకా కేంద్రం (డిఎఎటిటిసి) లాం గుంటూరు వారి ఆధ్వర్యంలో అపరాలు సమగ్రపంట యాజమాన్యం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం జి. కిషోర్ బాబు (డిఎఎటిటిసి)వారు మాట్లాడుతూ మినుము, పెసరలో వచ్చు తెగుళు,పురుగుల గురించి సంక్రమించే కాలం, నివారణ పద్ధతుల గురించి వివరించారు. ఉప్పల.శివరామకృష్ణ మినుము పంటను సందర్శించారు. పైరు చాలా ఆరోగ్యకరంగా ఉందని ఆశాజనకమైన దిగబడులు రావచ్చని తెలిపినారు. డిఎఎటిటిసి శ్రీలతవాణి పురుగు మందుల నివారణ చర్యలు గురించి తెలిపారు. ,మండల వ్యవసాయ అధికారి డి. వెంకట్రామయ్య,మునుకుదురు విఎఎ డివి. సుబ్బారావు, పెద్దలు, రైతులు పాల్గొన్నారు

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

పట్టణంలోని ఆర్‌టిసి గ్యారేజ్ లో రహదారి భద్రత పై అవగాహనా సదస్సు బుధవారం నిర్వహించారు. డిపో మేనేజర్ టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెనాలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి రాఘవరావు పాల్గొని మాట్లాడారు.రోడ్డు భద్రత గురించి తెలుసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా నైపుణ్యమైన డ్రైవింగ్ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంయుఐ ఎస్‌బి మధుసూదనరావు, ట్రైనింగ్ ఆర్‌డిఓ సునీల్ కుమార్, ప్రసాద్, మనీషా పాల్గొన్నారు. డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది, ప్రైవేట్ వాహన డ్రైవర్లు పాల్గొన్నారు.



ముఖ్యఅతిథులను సన్మానిస్తున్న డిపో మేనేజర్ టి. శ్రీనివాసరావు

ఏపి మా ఆధ్వర్యంలోసూపర్‌స్టార్ కృష్ణ పురస్కారం

ప్రజాశక్తి-తెనాలి

చలనచిత్ర రంగంలో విశేష సేవలందించిన వారికి ఏపి మూవి ఆర్ట్స్ అసోసియేషన్(ఏపి మా) ఆధ్వర్యంలో సూపర్ స్టార్ కృష్ణ పురస్కారాన్ని ప్రతి ఏటా అందించనున్నట్లు మా అధ్యక్షులు దిలీప్ రాజా చెప్పారు. స్థానిక ఆలపాటి నగర్‌లోని కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఇరు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించే ప్రజా బ్యాలెట్ ద్వారా పురస్కార ఎంపిక జరుగుతందన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు తెల్లకాగితంపై వారికి నచ్చిన ముగ్గురు నటుల పేర్లు రాసి, 'మా ఏపి కార్యాలయం, ఆలపాటి నగర్, సుల్తానాబాద్, తెనాలి' చిరునామాకు పంపాలన్నారు. వాటిని పరిశీలించి వారిలో ఒకరికి సూపర్ స్లార్ కృష్ణ పుసర్కారాన్ని అందిస్తామన్నారు. బ్యాలెట్‌లో పాల్గొనే వారు తమ చిరునామా, ఫోన్ నెంబరును కూడా పొందుపరచాలన్నారు. కృష్ణ కుటుంబ సభ్యులతో చర్చించి, పురస్కారం ప్రధానోత్సవం వివరాలు వెల్లడిస్తామన్నారు. సమావేశంలో మిలటరి ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దిలీప్ రాజా

ఉత్సాహభరితంగా ఎడ్ల పందేలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరి గ్రామంలో ఒంగోలు జాతి వృషభరాజముల బండి లాగుడు పోటీలు గత మూడు రోజులుగా జరుగుతున్నాయి. దనేకుల అప్పారావు, అనసూయమ్మ మెమోరియల్ పేరుతో దనేకుల నరసింహారావు (బాబు), గ్రామంలోని పలువురి రైతుల సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఎడ్ల పోటీలు తిలకించడానికి వచ్చిన ప్రజలకు భోజన సదుపాయం చేయడంతో పలువురు రైతులు, గ్రామస్తులు, నరసింహారావు దంపతులను శాలువా కప్పి, సన్మానించి అభినందించారు. ఉదయం 8 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు రైతాంగం రోడ్డుపై నిలబడి ఈ పోటీలను తిలకించడం చిర్రావూరిలో పండగ వాతావరణం చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి 10 గంటల వరకు జరిగిన ఎడ్ల పోటీలలో జూనియర్స్ విభాగంలో, కృష్ణాజిల్లా, చల్లపల్లి మండలం, కొత్త మాడేరు గ్రామానికి చెందిన తుమ్మల వెంకటరావు ఎడ్లు ప్రథమ బహుమతి కైవస చేసుకోగా, రెండో బహుమతి బాపట్ల జిల్లా, అమృతలూరు మండలం, పెదపూడి గ్రామానికి చెందిన ఆలా హరికృష్ణ యాదవ్ ఎడ్ల జత కైవసం చేసుకుంది. అనంతరం జూనియర్స్ ఎడ్ల జత విజేతలను పశుపోషణ నిర్వాహకులు శాలువాలను కప్పి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మక్కపాటి వెంకటకృష్ణారావు, మక్కపాటి ఏసు ప్రసాద్, శివయ్య, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

ఎడ్ల పందేల నిర్వాహకులకు రైతుసంఘం నాయకుల అభినందన

అంతరించిపోతున్న గ్రామీణ కళలను, వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. బుధవారం చిర్రావూరు జరుగుతున్న, జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల, బండి లాగుడు పోటీలను రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన తిలకించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ వ్యవసాయ భూములు తగ్గి, పశుపోషణ కష్టతరమవుతున్న ప్రస్తుత తరుణంలో వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని ప్రోత్సహించేందుకు చిర్రావూరు పశుపోషకులు దనేకుల నరసింహారావు ఎడ్ల పందాలను గ్రామస్తులతో కలిసి నిర్వహించడం అభినందించదగ్గ విషయమని రైతు నాయకులతో కలిసి అభినందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, రైతు సంఘం రాజధాని నాయకులు కొర్రపోలు ఈశ్వరరెడ్డి, చిర్రావూరు రైతు సంఘం నాయకులు మేడురి పాములు, నాయకులు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



నిర్వాహకులను అభినందిస్తున్న జొన్న శివశంకరరావు



ప్లాస్టిక్ తయారీ యూనిట్లను తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

ప్లాస్టిక్ తయారీ యూనిట్లలో తనిఖీలు

ప్రజాశక్తి-తెనాలి

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా మునిసిపల్ అధికారులు బుధవారం స్థానిక సుల్తానాబాద్‌లోని ఇండస్ట్రియల్ ఎస్టేట్లో ఉన్న ప్లాస్టిక్ తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం నిషేధించిన కవర్లను తయారు చేయరాదని నిర్వాహకులకు చెప్పారు. 75 మైక్రానుల మందం లోపు తయారీని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారిణి కేసిహెచ్ నిర్మల, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏ.రామచంద్రరావు, జి ప్రసాద్, మెప్మా సిటీ మిషన్ మేనేజ్మెంట్ ఆఫీసర్ మాధవరావు, వార్డు శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.



ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

హార్మోనియం కళాకారుడు ప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బోస్‌రోడ్డలోని పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో బుధవారం ఎన్టీఆర్ నటించిన మహా మంత్రి తిమ్మరసు చిత్రాన్ని ప్రదర్శించారు. అలాగే కళాకారుల సత్కారాల పండుగలో భాగంగా పట్టణానికి చెందిన రంగస్థల కళాకారుడు, హార్మోనిస్ట్ చిలకా ప్రసాద్‌ను ఉత్సవ కమిటీ సత్కరించారు.కార్యక్రమంలో అన్నం పిన్నారావు, షేక్ గౌస్ భాషా, షేక్ జానిభాషా, అన్నం గణపతి, మణికంఠ, పెమ్మసాని పోతురాజు, అయినాల మల్లేశ్వరరావు, ఎం.రాఘవరావు, జి.ప్రసాద్, డి.భవాని పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అన్నబత్తుని శివకుమార్

శేషంరాజు చేసిన సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-తెనాలి

భట్రాజు సామాజిక వర్గం సంక్షేమానికి శేషంరాజు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక రైస్ కాలనీలో శేషంరాజు నిర్మించిన సత్యసాయిబాబా మందిరంలో నిర్వహించిన బాబా జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. తొలుత మందిరాన్ని నిర్మించిన శేషంరాజు విగ్రహానికి ఆయన నివాళు లర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు విద్య, వైద్యం అందించిన బాబా సేవలకు నిదర్శనంగా శేషంరాజు మందిరం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. అలాగే కాలనీకి చెందిన బి.శ్రీనివాసరావు కుమారుడు అనారోగ్యంతో ఉండటంతో సిఎం సహాయనిధి నుంచి వచ్చిన చెక్కును ఎమ్మెల్యే వారికి అందించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం, వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, భట్రాజు ఫెడరేషన్ డైరెక్టర్లు సుష్మ, కిషోర్‌రాజు, కె.రామరాజు, తంగెళ్ళ సత్యనారాయణరాజు, కె.ఆంజనేయరాజు, కేవిఎస్ఎస్ రాజు, సీతారామరాజు, ఎస్.రమాదేవి, ఎల్.గంగరాజు, కౌన్సిలర్ కె.యశోద పాల్గొన్నారు.

విటమిన్ కె లోపానికి జన్యు కారణాన్ని కనుగొన్నాం

- విజ్ఞాన్ యూనివర్సిటీ రీసెర్చ్ అడ్వైజర్ ప్రొఫెసర్ పీబీ కవికిషోర్



మాట్లాడుతున్న కవికిషోర్

ప్రజాశక్తి-గుంటూరు

మానవాళిలో విటమిన్-కె లోపానికి కారణమైన జన్యువులను మొదటిసారిగా కనుగొన్నామని విజ్ఞాన్ యూనివర్సిటీ రీసెర్చ్ అడ్వైజర్ ప్రొఫెసర్ పీబీ కవికిషోర్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బయోటెక్నాలజీ విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థి షాలిని రాజగోపాల్, కేరళలోని కొల్లాం అమృత విశ్వ విద్యాపీఠం అధ్యాపకుడు డాక్టర్ ప్రశాంత్ సురవార్ఝుల, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్టీ-సెర్బ్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్వహించిన పరిశోధనలో విటమిన్-కె లోపానికి కారణమైన జన్యువులను కనుగొన్నారు. ఇప్పటివరకు విటమిన్-కె లోపానికి కారణమైన జన్యువులను ఎవరూ గుర్తించలేదని, వివిధ యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో మొట్టమొదటసారిగా కనుగొన్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్ పీబీ కవికిషోర్ మాట్లాడుతూ 'డిసెక్టింగ్ విటమిన్-కే పాత్‌వేస్ ఇన్ హ్యూమన్ యూజింగ్ నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ అనాలిసిస్' అనే అంశంపై పరిశోధన చేశామన్నారు. విటమిన్-కె లోపానికి కారణమైన జన్యువులను గుర్తించడానికి గడిచిన రెండేళ్లలో దాదాపు 5 రాష్ట్రాల నుంచి సేకరించిన శాంపిల్స్ పరిశీలించామన్నారు. విటమిన్-కె లోపానికి కారణమైన జన్యువులను డయాగ్నసిస్ చేసే ప్యానెల్‌ను ఇండస్ట్రీల సహాయంతో తయారు చేస్తున్నామన్నారు. ఈ ప్యానెల్‌ను ప్రజలకు వీలైనంత త్వరలో అతి తక్కువ ఖర్చుతో అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్యానెల్ ద్వారా విటమిన్-కె లోపం ఉన్న వారిని సులభంగా గుర్తించవచ్చన్నారు. విటమిన్-కె లోపం వలన అల్జీమర్స్, మతిమరుపు, మూత్ర విసర్జన, రక్తం గడ్డకట్టకపోవడం వంటి జబ్బులతో పాటు అనేక రకాలైన వ్యాధులు వస్తాయన్నారు. ఆకుకూరలు, పాలకూర, మెంతికూర, చుక్కకూర, తోటకూర, మునగాకు, బచ్చలాకు, క్యాబేజీ, పండ్లు ఎక్కువగా తీసుకుంటే విటమిన్-కె లోపాన్ని నివారించవచ్చన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న సూట్స్‌కేర్, చలపతి ప్రతినిధులు

సూట్స్‌కేర్‌తో చలపతి ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

సూట్స్ కేర్ నెట్వర్క్‌తో మోతడకలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజి హెల్త్ పార్టనర్‌గా ఒప్పందం కుదుర్చుకోవటం చాలా సంతోషంగా ఉందని కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ రంగారావు అన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తూ అందరికీ అందుబాటులో నాణ్యమైన వైద్యం తీసురావటానికి సూట్స్ కేర్ నెట్‌వర్క్ కృషి చేస్తుందన్నారు. హెల్త్ పార్టనర్ భాగస్వామ్యంతో కాలేజి విద్యార్థులకు వైద్య సేవలతో పాటు, అవగాహనా కార్యక్రమాల నిర్వహణకు, విద్యార్థుల తల్లిదండ్రుల ఆరోగ్య సంరక్షణ బాధ్యతలను సూట్స్‌కేర్ నెట్‌వర్క్ అందిస్తుందన్నారు. సూట్స్ కేర్ నెట్వర్క్ జనరల్ మేనేజర్ మహబూబ్ భాష మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థి దశ నుండే ప్రతిఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఇప్పటికే కొన్ని విద్యాసంస్థలతో హెల్త్ పార్టనర్‌గా ఒప్పడం కుదుర్చుకున్న సూట్స్ కేర్ నెట్వర్క్ రాబోయే రోజుల్లో రాష్ట్రంలో అందుబాటులోకి హెల్త్ కేర్ తీసుకొని రావడానికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో చలపతి కాలేజి వైస్ ప్రిన్సిపల్ నాగశ్రీనివాసరావు, యన్‌యస్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగేశ్వర రావు, డాక్టర్ వి. సుబ్బారావు, సూట్స్ కేర్ నెట్వర్క్ తరుపున ఏ.హెచ్.సి డైరెక్టర్ వెంకట్, రాజ్ కుమార్, గొల్లపల్లి లలిత్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.

డొంకరోడ్డు విస్తరణ బాధితులకు పరిహారం ఇవ్వాలి


మేయర్‌కు వినతిపత్రం అందచేస్తున్న బాధితులు

ప్రజాశక్తి-గుంటూరు : డొంక రోడ్డు విస్తరణలో నష్టపోతున్న గృహాలకు తగిన పరిహారం అందిస్తామని, ఎంతో మందికి ఉపయోగకరమైన రోడ్డు విస్తరణకు సహకరించాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు కోరారు. బుధవారం డొంక రోడ్డు విస్తరణలో ప్రభావితమవుతున్న ఇళ్ళ నివాసులు మేయర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి నష్టపరిహారం ఇప్పించాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ వలన గుంటూర్ పశ్చిమ నియోజకవర్గం, తూర్పు నియోజకవర్గాలకు అనుసంధానమైన అరండల్‌పేట ఫ్లై ఓవర్ ట్రాఫిక్ జాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అమరావతి రోడ్డు నుండి డొంక రోడ్డు వైపు రోడ్డు విస్తరణ జరిగితే ట్రాఫిక్ సమస్యకు చాలా వరకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఇంతటి కీలకమైన రోడ్డు విస్తరణ పనులు గతంలో కొంత మేర నిర్వహించి, సగంలో వదిలేశారన్నారు. ఈ రోడ్డు విస్తరణ ద్వారా స్థానిక ప్రజలకు కొంత మేర ఇబ్బంది కలిగినప్పటికీ విస్తరణ అనంతరం మెరుగైన మౌలిక వసతులు అందుతాయన్నారు. అలాగే విస్తరణలో ప్రభావితమయ్యే భవనాలకు తగిన నష్టపరిహారం అందించేలా అధికారులను పరిశీలించమని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మల్లెబోయిన శ్రీవల్లి, టౌన్ ప్లానింగ్ ఏ.సి.పి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శనివారం హౌసింగ్ డే పాటించాలి

- గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్
- పొత్తూరు, ఏటుకూరు లేఅవుట్ల పరిశీలన
- డిసెంబర్ 21 నాటికి ప్రతి మండలంలో ఒక లేఅవుట్‌లో నూరుశాతం ఇళ్ల నిర్మాణం : జిల్లా కలెక్టర్


మాట్లాడుతున్న అజయ్ జైన్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రతి శనివారం హౌసింగ్ డే పాటించి సంబంధిత శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు లే అవుట్‌లలో ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, నవరత్న పథకాల ప్రభుత్వ సలహాదారు శామ్యూల్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ, హౌసింగ్ సిఎండి శివ ప్రసాద్ తో కలసి నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళ నిర్మాణాలు, పీఎమ్ఎవై గ్రామీణ ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ, ఎంపీడీవోలు, హౌసింగ్, పంచాయితీ రాజ్ ఇంజినీరింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పేదలందరికీ ఇళ్ల పథకంలో 69,312 ఇళ్ళు మంజూరు అయ్యాయని, 64,975 ఇళ్ళు రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, 63,745 ఇళ్ళు గ్రౌండింగ్ చేయటం జరిగిందన్నారు. వీటిలో 3,942 ఇళ్లు నిర్మాణం పూర్తి అయ్యిందని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. డిసెంబరు 21నాటికి ప్రతి మండలంలో ఒక లే అవుట్‌లోని నూరుశాతం ఇళ్ళు నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30 లక్షలు మందికి ఇంటి స్థలాలు పంపిణీ చేశారని, వీటిలో మొదటి విడతలో దాదాపు 21 లక్షల ఇళ్ళ నిర్మాణాలను కేంద్రప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇంటి స్థలాల కోసం, ఇంటి నిర్మాణాలకు అనుగుణంగా లే అవుట్ లలో మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు, ఇంటి నిర్మాణాలకు దాదాపు రూ. లక్ష కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. ఇళ్లు నిర్మించుకునే వారికి రూ. 1.80 లక్షల నగదు, ఉచితంగా ఇసుకతో పాటు రాయితీపై సిమెంట్, ఇనుము, ఇంటికి అవసరమైన 14 రకాల పరికరాలు, డ్వాక్రా సంఘాల్లోని లబ్ధిదారులకు రూ.35,000 బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకి రుణం అందిస్తుందన్నారు. జిల్లాలో ప్రతి శనివారం హౌసింగ్ డే గా పాటిస్తూ మండల పరిధిలో ఎంపీడీవో నాయకత్వంలో, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ నాయకత్వంలో అధికారులందరూ ప్రతి వారం ఒక సచివాలయంకు వెళ్ళి అక్కడ గృహ నిర్మాణాల పురోగతి పై సమీక్షించాలనీ, సంబంధిత లే అవుట్ కి వెళ్ళి క్షేత్ర స్థాయిలో ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి ఏమైన ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ళ నిర్మాణాల పూర్తికి 2024 మార్చి వరకు గడువు విధించినందున 2023 జూన్ నాటికి నూరు శాతం పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వి.ఎస్.సాయినాథ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్లు మోవిడి వాణి, సాయిశ్రీ, ఆర్డీవో ప్రభాకర రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలించిన అజయ్ జైన్

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, నవరత్న పథకాల ప్రభుత్వ సలహాదారు శామ్యూల్, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి, నగరపాలక సంస్థ కమీషనర్ కీర్తి చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారయణ శర్మతో కలసి బుధవారం నగర శివారులోని పొత్తూరు, ఏటుకూరు లే అవుట్లను పరిశీలించారు. నిర్మాణాలు పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. గృహ ప్రవేశాలు చేయబడిన ఇళ్ళకు ముందు భాగంలో నవరత్నాలు, పీయంఏవై లోగో లను తప్పక ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మోవిడి వాణి, నగరపాలక సంస్థ పర్యవేక్షక ఇంజనీర్ భాస్కర రావు, హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రాజెక్టులపై రాజీవ్‌గౌబా వీడియో కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే పలు ప్రాజెక్టుల పురోగతిపై కేంద్ర ప్రభుత్వ మానిటరింగ్ గ్రూప్ క్యాబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లా కలెక్టర్లతో బుధవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని గుంటూరు - గుంతకల్లు రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు కోసం నుదురుపాడు గ్రామంలో భూసేకరణ, మంగళగిరి ఆలిండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)పై కలెక్టర్‌తో పాటు ఆర్అండ్‌బి, ఫారెస్ట్ శాఖల అధికారులతో సమీక్షించారు. రాజీవ్‌గౌబా మాట్లాడుతూ గుంటూరు-గుంతకల్లు రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు కోసం ఫిరంగిపురం మండలం నుదురుపాడులో 2.30 ఎకరాలు భూ సేకరణ ప్రాజెక్ట్ పెండింగ్‌లో ఉందని, డిసెంబర్ 15 నాటికి భూసేకరణ పూర్తి చేసి రైల్వే శాఖకు ఆ స్థలాన్ని అప్పగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. అనంతరం మంగళగిరి ఎయిమ్స్‌లో అందిస్తున్న సేవలు గురించి, ఆస్పత్రి నిర్వహణకు కావలసిన నీటి వసతి సౌకర్యం కల్పించే పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళగిరి ప్రధాన రహదారి నుండి ఎయిమ్స్‌కు వెళ్ళే అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలక్టరేట్‌లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెసి రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, గుంటూరు, పల్నాడు డిఆర్‌ఓలు కె.చంద్ర శేఖరరావు, వినాయకం తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత

కెఎల్‌యులో పోస్టర్ ఆవిష్కరణలో విసి డాక్టర్ జి.పార్థసారథి వర్మ

డిసెంబర్ 13,14 తేదీలలో పిల్లల పండుగ



ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విద్యార్థుల్లోని సజనాత్మకతను బయటకు తీసేందుకు, విద్యార్థి దశ నుండే పిల్లలలో ఆత్మస్థైర్యం నింపేందుకు బాలోత్సవం (చిన్నపిల్లల పండగ) ఓ వేదిక కానుందని కె.ఎల్.డీమ్డ్ టు.బి.యూనిర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్.జి.పార్థసారథి వర్మ అన్నారు. బుధవారం ఎంటిఎంసి పరిధిలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో బాలోత్సవం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్థసారథి వర్మ మాట్లాడుతూ పిల్లలలోని నైపుణ్యతను మరింత పెంచేందుకు ఈ బాలోత్సవం ఉపయోగపడుతుందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సెల్ ఫోన్‌కి కనెక్ట్ అవుతున్న ఈ తరుణంలో విద్యార్థుల మేధాశక్తిని పెంపొందించేందుకు ఈ బాలోత్సవం సరైన వేదిక అని, డిసెంబర్ 13,14 తేదీలలో జరిగే బాలోత్సవానికి అన్ని విధాల కేఎల్ యూనివర్సిటీ తోడ్పడుతుందని ఆయన అన్నారు. మంగళగిరి, తాడేపట్టి పట్టణాల పరిదిలో ఉన్న రెండు వందల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు సుమారు మూడు వేల మంది పాల్గొంటారని కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విసివెంకట్రామన్ అన్నారు. కార్యక్రమంలో చిత్రలేఖనం, వక్తత్వం, క్విజ్, గీతాలాపన , వ్యాసరచన, కథా రచన, మ్యాప్, కవితా రచన, మట్టితో బొమ్మలు, తెలుగులో మాట్లాడడం, పద్యం, భావం, జానపద నత్యం, దేశభక్తి గీతాలాపన, కోలాటం, క్విజ్, భరత నాట్యం, కూచిపూడి, విచిత్ర వేష ధారణ వంటి సుమారు 20 పైగా అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో బాలోత్సవం కమిటీ అధ్యక్షులు వివి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె శ్రీపతిరాయ్, కోశాధికారి జి సుబ్బారెడ్డి, అమరావతి బాలోత్సవం అధ్యక్షులు పిన్నమనేని మురళీకష్ణ, డీన్ విద్యార్థుల వ్యవహారాల ఇన్చార్జి హనుమంతరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు గాదె సుబ్బారెడ్డి, ప్రముఖ పిల్లల వైద్యులు సాయి ప్రసాదు, విశ్రాంత సైనికులు గోపాలం సాంబశివరావు, జే ఎస్ ఆర్ మోహన్ రావు (సిఎటి) అధ్యక్షులు తాడేపల్లి., ఆంధ్ర నాటక కళ సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, డీజే జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ మంగళగిరి ప్రగడ రాజశేఖర్, ఫ్యూజన్ ఫుడ్ తాడేపల్లి డైరెక్టర్ పి లక్ష్మి, బాలల సంఘం నాయకులు సింహాద్రి సుమ పాల్గొన్నారు.